విశాఖపట్టణం
బుధవారం 23 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 222 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# నేను రక్తం అమ్ముకున్నానా..?



నా రెమ్యూనిరేషన్ ముందు ఆ డబ్బు ఎంత

ఎన్ని ప్యాకెట్లు అమ్ముకుంటే ఆ సొమ్ము వస్తుంది

ఎంత మూర్ఖమైన ప్రచారం చేసారు

నాకు చాలా అవమానాలు జరిగాయి

మెగా యూత్ ఫోర్స్ మీటింగ్‌లో చిరంజీవి ఆవేదన

2



## ఎవరికీ గౌరవం తగ్గరాదు

అంతా కలిసి కట్టుగా పని చేయాలి

పదువులు తీసుకున్న నేతలు మెత్తపడ్డారు

త్వరలో క్యాంపు కార్యాలయం ఓపెన్ చేస్తా

అందరినీ యాక్టివేట్ చేస్తా

దేశానికే ఆదర్శంగా పిఠాపురం నియోజకవర్గం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

(పిఠాపురం - జయజయహే)

కూటమి ప్రభుత్వంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని, అదే సమయంలో ఎవరి గౌవరం తగ్గకూడదని.. జనసేన పార్టీ గౌరవానికి భంగం వాటిల్లకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తనకు కృతజ్ఞత చూపించేతత్వం చాలా ఎక్కువని, అది తన స్వభావం అన్నారు. వచ్చే 3, 4 నెలల్లో క్యాంప్ ఆఫీసు పిఠాపురానికి మార్చుతానని, జనసేన నాయకులందరికీ దిశా నిర్దేశం చేయాలన్నారు. పదవులు తీసుకున్న తరువాత మన నాయకులంతా మెత్తపడ్డారంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ..మిగతా 2లో

# 2047 నాటికి స్వర్ణ మున్సిపాలిటీలు

రూ. 11, 359 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు

పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం

మౌలిక వసతుల మెరుగుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్

సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన

కుప్పం నుంచి భారీ కార్యాచరణకు శ్రీకారం





(కుప్పం - జయజయహే)

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల రూపురేఖలను సమూలంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం భారీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో రూ.11,359 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పంలోని కడపల్లె నుంచి ఆయన ఈ కీలక కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మున్సిపల్ చరిత్రలోనే ఈ రోజును ఒక సువర్ణాధ్యాయంగా అభివర్ణించిన సీఎం.. పట్టణ ప్రాంతాలను రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజిన్లుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధిపై నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని పట్టణాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పార్కులు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రూ.11,359 కోట్ల విలువైన పనులకు తాజాగా అడుగులు పడ్డాయి. రాష్ట్రంలో ఇప్పటికే రూ.22,330 కోట్ల అభివృద్ధి పనులు విభిన్న దశల్లో శరవేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు అన్నారు. మరో ఆరు నెలల వ్యవధిలో రూ.17,000 కోట్ల విలువైన కొత్త పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ..మిగతా 2లో

# 2012-16 వరకు నంది అవార్డులు

సినీ, టీవీ రంగాలకు పురస్కారాలు

2017-24 ప్రతీ ఏడాదికి నాలుగు అవార్డులు

డిసెంబర్ లోగా అన్ని అవార్డులు ప్రదానం

ఎఫ్ డీసీ చైర్మన్ భరత్ బూషణ్ వెల్లడి

(అమరావతి - జయజయహే)

నంది అవార్డులపై ఎఫ్‌డీసీ చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ.. గతంలో ప్రకటించిన 2012 నుంచి 2016 వరకు నంది ఫిల్మ్, టీవీ అవార్డులను అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2017 నుంచి 2024 వరకు ప్రతి సంవత్సరానికి 4 అవార్డుల చొప్పున -- 2 ప్రొడక్షన్, 2



స్పెషల్ జ్యూరీ అవార్డులు అందించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఎఫ్‌డీసీ చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ.. 2025 సంవత్సరానికి కూడా నంది ఫిల్మ్, టీవీ అవార్డులను అందించేందుకు నిర్ణయం తీసుకున్నాం.. నంది ఫిల్మ్, జాతీయ చలనచిత్ర అవార్డులను అమరావతి లేదా విజయవాడలో నిర్వహించేందుకు నిర్ణయించాం.. నంది టీవీ అవార్డులను తిరుపతి వేదికగా అందించేందుకు నిర్ణయించాం. ఈ అవార్డులన్నింటినీ డిసెంబర్ 2026లోగా ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అలాగే అక్టోబర్‌లో నంది ఫిల్మ్, టీవీ అవార్డుల కోసం కమిటీలను ఏర్పాటు చేస్తాం.. నవంబర్‌లో అవార్డుల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. డిసెంబర్‌లో నంది ఫిల్మ్, టీవీ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలను ..మిగతా 2లో

## అంత ఖర్మ పట్టలేదు

కూతురు పెళ్లి పేరుతో రాజకీయాలు చేసే నైజం కాదు

సోషల్ మీడియా వార్తలన్నీ కట్టు కథలే

రాజకీయ విశ్లేషణ పేరిట నిరాధార వార్తలు

అన్ని పార్టీల అధినేతలనే పిలిచినట్లే జగన్ కు ఆహ్వానం

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పష్టీకరణ

(అమరావతి - జయజయహే)



సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారాలపై కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కుమార్తె వివాహం అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేసే ఖర్మ తనకు పట్టలేదంటూ ఘాటుగా స్పందించారు. తాను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ కేవలం కట్టుకథలని, అందులో నిజం లేదని కొట్టిపారేశారు. రాజకీయ విశ్లేషణల పేరిట జరుగుతున్న ఈ ప్రచారం పూర్తిగా నిరాధారమని, శుద్ధ అబద్ధమని తేల్చిచెప్పారు. గిట్టని వారు చేస్తున్న పస లేని ఆరోపణలను ..మిగతా 2లో



## ఘాట్ రోడ్డు క్లోజ్..!

22 నుంచి 28 వరకు మూసివేత

ప్రత్యామ్నాయ మర్గాలను పాటించాలి

దసరా ఉత్సవాల వేళ ఆంక్షలు

దేవస్థానం అధికారులు కీలక నిర్ణయం

(విజయవాడ - జయజయహే)

విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దసరా పండుగ సందర్భంగా ఇంద్రకీలాద్రిపైకి భక్తుల రద్దీ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో, ఆలయ అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 22 నుంచి వారం రోజుల పాటు (సెప్టెంబర్ 28 వరకు) ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును పూర్తిగా మూసివేస్తున్నట్లు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. సీనా నాయక్ వెల్లడించారు. ఘాట్ రోడ్డు మరమ్మతులు, ..మిగతా 3లో

## గ్రేటర్ విశాఖ నేతలతో నేడు జగన్ భేటీ

(తాడేపల్లి జయజయహే)



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ బుధవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గ్రేటర్ విశాఖపట్నంకు చెందిన స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ పరిధిలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణతో పాటు స్థానిక రాజకీయ పరిణామాలపై నేతలు, కార్యకర్తలతో వైయస్ జగన్ చర్చించనున్నారు.



## ఉత్తరాంధ్రకు రెడ్ అలెర్ట్..!

కోస్తాకు ఫ్లాష్ ఫ్లడ్స్

2

భారీ నుంచి అతిభారీ వర్షాలు

తీవ్ర వాయుగుండంగా మారనున్న వాయుగుండం

విశాఖ - గోపాల్ పూర్ మధ్య తీరం దాటే అవకాశం

## ఉత్తరాంధ్రలో విద్యా సంస్థలకు సెలవు

2

## ఇక అదనపు పించన్

సహాయాన్ని పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం

(అమరావతి - జయజయహే)



పింఛనుదారులకు అదనపు పింఛన్ శాతాన్ని పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అదనపు పింఛన్ రేట్లను పునరుద్ధరిస్తూ జీవో ఎంఎస్ నంబర్- 126ను ఆర్థిక శాఖ విడుదల చేసింది. 70 ఏళ్లు పూర్తయిన పింఛనుదారులు/ఫ్యామిలీ పింఛనుదారులకు అదనపు పింఛన్‌ను 7శాతం నుంచి 10శాతానికి రాష్ట్ర సర్కార్ పెంచింది. 75 ఏళ్లు పూర్తయిన పింఛనుదారులకు అదనపు పింఛన్‌ను 12శాతం నుంచి 15శాతానికి కూటమి సర్కార్ పెంచింది. పెంచిన అదనపు పింఛన్ డిసెంబర్ 2026 నెల పింఛనుకు వర్తిస్తుందని స్పష్టం చేసింది పెరిగిన ఈ మొత్తాన్ని జనవరి 1, 2027న చెల్లించనుంది. 80 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి అదనపు పింఛన్ రేట్లలో ఎలాంటి మార్పు లేదని సర్కార్ తేల్చిచెప్పింది. ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘాల విజ్ఞప్తి మేరకు పరిశీలించి పాత రేట్లను ఏపీ ప్రభుత్వం పునరుద్ధరించింది.

## సాంబారు టబ్‌లో పడి మహిళ మృతి

2

చిట్టినగర్ వినాయక అన్నదానంలో ఘటన

For a pure tomorrow.. జయహో

# 2047 నాటికి స్వర్ణ మున్సిపాల్టీలు

మొదటి పేజీ తరువాయి...

సీఎం వెల్లడించారు. ప్రస్తుతం నడుస్తున్న, ప్రతిపాదించిన పనులన్నీ కలిపి మొత్తం రూ.50,000 కోట్ల భారీ ప్రణాళికతో మున్సిపల్ శాఖ ముందడుగు వేస్తోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతికి పెద్దపీట వేస్తున్నామని, ఈ నమూనాలో రూ.7,496 కోట్ల పనులు చేపట్టనున్నట్లు సీఎం వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖపట్నం కార్పొరేషన్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చంద్రబాబు అన్నారు. ఒక్క విశాఖ నగర పరిధిలోనే ఏకంగా రూ.3,890 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. విశాఖలో ఇప్పటికే 28,500 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, ఎలాంటి వివాదాలు, అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు చంద్రబాబు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన టిడ్కో గృహాల నిర్మాణంపై సీఎం స్పష్టత ఇచ్చారు. 'గత పాలకులు కేంద్ర ప్రాయోజిత పథకమైన జల్ జీవన్ మిషన్ సహా పలు అభివృద్ధి నిధులను సద్వినియోగం చేయకుండా నిర్లక్ష్యం చేశారు. మేం ఎదురైన సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం. 2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహనిర్మాణ ప్రాజెక్టులన్నింటినీ సంపూర్ణంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తాం.' అని చంద్రబాబు నాయుడు అన్నారు.



పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే కాకుండా, రాబడిని పెంచే మార్గాలపై శ్రద్ధ చూపాలని అధికారులకు సీఎం సూచించారు. ప్రతి మున్సిపాలిటీలో క్వాలిటీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ సీవరేజి, అందమైన పార్కులు, సెంట్రల్ మీడియన్లు నిర్మించాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్ల ద్వారా నీటిని నిల్వ చేసే సమగ్ర నీటి సరఫరా ప్రాజెక్టులను వేగవంతం చేయాలన్నారు. పట్టణాల్లో వారాంతపు ఆర్థిక కార్యకలాపాలను, వినోద రంగాన్ని ప్రోత్సహించి లోకల్ ఎకానమీని బలోపేతం చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ 2047లో భాగంగా ప్రతీ మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులకు పిలుపునిచ్చారు. మున్సిపల్ పనుల శంకుస్థాపన అనంతరం సీఎం చంద్రబాబు గుండిశెట్టిపల్లె వద్దకు చేరుకుని హంద్రీనీవా సుజల స్రవంతి జలాలకు జలహారతి ఇచ్చారు.

# సాంబారు టబ్‌లో పడి మహిళ మృతి

### చిట్టినగర్ వినాయక అన్నదానంలో ఘటన

**(విజయవాడ - జయజయహే)**

అన్నదాన కార్యక్రమంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా చిట్టినగర్‌లో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన అన్నదానం సాంబారులో పడి ఓ మహిళ మృతిచెందారు. ఈ నెల 20న జరిగిన ఈ కార్యక్రమంలో 46 ఏళ్ల పద్మ సుజాత అనే మహిళ అన్నదాన ఏర్పాట్లలో పాలుపంచుకుంటూ పనిచేస్తున్నారు. ఆ సమయంలో ఊహించని విధంగా ఆమె పెద్ద సాంబార్ గిన్నె తీసుకెళ్తూ ప్రమాదవశాత్తూ అందులో పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పద్మ సుజాతను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడంతో విషాదం నెలకొంది. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని తమ స్వగ్రామానికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఆ వీడియో వెలుగులోకి రావడంతో ఈ ప్రమాదం జరిగిన తీరు చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా బంధువులతో కలిసి అప్పటివరకూ అన్నదానం కోసం వంటలు చేసిన మహిళ ప్రమాదవశాత్తూ చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పొయ్యిపై ఉన్న సాంబారు పాత్రను దింపుతుండగా అందులో పడిపోవడంతో ఆమెకు ముఖం, ఛాతీ సహా శరీరమంతా తీవ్ర కాలిన గాయాలయ్యాయని కుటుంబసభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వెల్లడించారు.

# ఎవరికీ గౌరవం తగ్గరాదు

మొదటి పేజీ తరువాయి...



సంకల్పమని స్పష్టం చేశారు. పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కాలేజీ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలబడటమే తన నైజమని పేర్కొన్న ఆయన, పిఠాపురం ప్రజల అవసరాలు తీర్చడమే మొదటి ప్రాధాన్యత అని ప్రకటించారు. ఈ ఏడాది చివరికల్లా పిఠాపురంలో తన క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు పూర్తి కాగా, తాజాగా మరో రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ఇప్పటికే రూ. 200 కోట్లతో 600కు పైగా సీసీ, బీటీ రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని పవన్ కళ్యాణ్ వివరించారు. మరో 202 రహదారులను తాజాగా ప్రారంభించినట్లు చెప్పారు. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణ ద్వారా 97 వేల మందికి తాగునీరు ఇస్తున్నామని, జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0, ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో దాదాపు రూ. 460 కోట్లతో గ్రామాలు, మున్సిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ రూ. 34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణం, రూ. 45 కోట్లతో కాకినాడ జీజీహెచ్‌లో ఆంకాలజీ బ్లాక్, పిఠాపురంలో రూ. 100 కోట్లతో ఆయుష్ మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పిఠాపురం పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ. 225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉప్పాడ తీరప్రాంత ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ. 323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిపిన చర్చలు, ఐఐటీ మద్రాస్ సర్వేల ఆధారంగా ఈ ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానుందని తెలిపారు. పీఎం గతిశక్తి కింద రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (=వాదీ), అమృత్ భారత్ పథకంలో రూ. 37 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ, పాడా నిధులతో రూ. 20 కోట్లతో బస్ స్టాండ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల కోరిక మేరకు రూ. 4 కోట్లతో ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కాలేజీ కొత్త భవనాలను నిర్మిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ చెప్పారు. పిఠాపురం అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, సీఎం చంద్రబాబుకి ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సహారా ఫీల్డ్ వర్కర్స్ అండ్ డిపాజిటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాన్వాయ్ ఆపి సమస్యలు విన్నవించారు. ప్రభుత్వాసుపత్రి సెంటర్లో కాన్వాయికి అడ్డంగా సభ్యులు వెళ్లడంతో కాన్వాయ్ ఆపి వారి సమస్యలు విన్నారు పవన్ కళ్యాణ్. సహారా నుంచి కోటి మంది డిపాజిట్ వర్స్ కు సంబంధించిన 25 వేల కోట్లు రావాల్సి ఉందని వినతి పత్రం ఇచ్చారు. డబ్బులు అందక డిపాజిటర్ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పవన్ కు విన్నవించారు.



# ఉత్తరాంధ్రకు రెడ్ అలెర్ట్..!

### కోస్తాకు ఫ్లాష్ ఫ్లడ్స్

### భారీ నుంచి అతిభారీ వర్షాలు

### తీవ్ర వాయుగుండంగా మారనున్న వాయుగుండం

### విశాఖ - గోపాల్ పూర్ మధ్య తీరం దాటే అవకాశం

**(విశాఖపట్నం - జయజయహే)**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. మరికొన్ని గంటల్లో తీవ్రవాయుగుండంగా మారనుంది. ఇది వేగంగా కదులుతూ విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్రవ్యాప్తంగా ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాబోయే 48 గంటల్లో అత్యంత భారీ నుంచి తీవ్ర భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. తీరం వెంట గంటకు 50 నుండి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారింది. దీంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు ఉత్తర కోస్తాకు ఫ్లాష్ ఫ్లడ్స్ అలెర్ట్ జారీ చేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలకు ముప్పు పొంచి ఉంది. అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ సూచనల మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ 20 సెం.మీ కంటే ఎక్కువ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విశాఖపట్నం, అనకాపల్లికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరికి ఎల్లో అలర్ట్ ఇచ్చారు. వర్ష తీవ్రత పెరగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు నదులు, గెడ్డలు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. విజయనగరం జిల్లా గింజేరు గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రహదారిపై నీరు చేరడంతో వాహనాలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. విపత్తు పరిస్థితుల దృష్ట్యా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించారు. తీర ప్రాంత ప్రజల భద్రత కోసం పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని సచివాలయాల పరిధిలో తక్షణ పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. కలెక్టర్లు రాంసుందర్ రెడ్డి (విజయనగరం), ప్రభాకర్ రెడ్డి (పార్వతీపురం మన్యం) అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు, బాధితులు సహాయం కోసం సంప్రదించాల్సిన 24/7 అత్యవసర కంట్రోల్ రూమ్ నంబర్లు ఏర్పాటు చేశారు. విజయనగరం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08922-236947, పార్వతీపురం మన్యం కంట్రోల్ రూమ్ 08963-450347కు అత్యవసర సమయాల్లో కాల్ చేయవచ్చు. తీరప్రాంతాల ప్రజలు అనవసరంగా బయటకు రాకుండా, అధికారికంగా ఇచ్చే వాతావరణ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉత్తరాంధ్రలో విద్యా సంస్థలకు సెలవు

**(విశాఖపట్నం - జయజయహే)**

వర్షాల తీవ్రత దృష్ట్యా విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం జిల్లాల్లోని పాఠశాలలకు డీఈవోలు (బుధవారం సెలవు ప్రకటించారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు గింజేరుగెడ్డ భారీగా వరద నీరు చేరింది. దీంతో చంద్రంపేట-వసంత రహదారిపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం, గుమ్మలక్ష్మీపురం పరిధిలో వాగులు, గెడ్డలు పొంగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో గడిచిన మూడు గంటల్లోనే 6 సెం.మీ వర్షం కురిసింది. పలాస, రావివలస, సంతబొమ్మాళిలో 4 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లా తుని, పిఠాపురం తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి.

# నేను రక్తం అమ్ముకున్నానా..?

### నా రెమ్యూనిరేషన్ ముందు ఆ డబ్బు ఎంత

### ఎన్ని ప్యాకెట్లు అమ్ముకుంటే ఆ సొమ్ము వస్తుంది

### ఎంత మూర్ఖమైన ప్రచారం చేసారు

### నాకు చాలా అవమానాలు జరిగాయి

### మెగా యూత్ ఫోర్స్ మీటింగ్ లో చిరంజీవి ఆవేదన

**(హైదరాబాద్ - జయజయహే)**

మెగాస్టార్ చిరంజీవికి అశేష సంఖ్యలో అభిమానులు ఉన్నారు. ఆయనకు బోలెడు అభిమాన సంఘాలు ఉన్నాయి. అందులో కీలకంగా పని చేస్తున్న అభిమాన సంఘాల్లో 'మెగా యూత్ ఫోర్స్' ఒకటి. ఇటీవల వాళ్ళతో చిరంజీవి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆ కార్యక్రమంలో తన 47 ఏళ్ళ సినీ ప్రస్థానం, అభిమానులు అందరితో ఉన్న ప్రేమానుబంధం, 1998 నుంచి నిరంతరాయంగా సాగుతున్న రక్తదాన శిబిరాలు గురించి మాట్లాడటంతో పాటు జీవితంలో విమర్శలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా రక్తదాన శిబిరాలపై వచ్చిన విమర్శల పట్ల మెగాస్టార్ స్పందించారు. కథానాయకుడిగా తనకు ఎంతో పేరు ప్రఖ్యాతలు ఇచ్చిన అభిమానులు, ప్రేక్షకుల కోసం ఏదైనా మంచి చేయాలనే ఆలోచనతో 'చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్' నెలకొల్పారు మెగాస్టార్. ఆయన ఇచ్చిన పిలుపుతో ఎంతో మంది అభిమానులు ముందుకు వచ్చి రక్తదానాలు చేశారు. తమ మరణానంతరం కళ్ళు దానం చేసిన అభిమానులు సైతం ఉన్నారు. తద్వారా ఎంతో మంది చూపు వచ్చింది. రక్తదానాల వల్ల ఎందరో ప్రాణాలు నిలబడ్డాయి. అయితే ఆ బ్లడ్ బ్యాంకుపై విమర్శలు వచ్చాయి. చిరంజీవి రక్తం అమ్ముకుంటున్నాడని ఆరోపణలు చేశారు కొందరు. వారిపై చిరు స్పందించారు. "నాకు అవమానాలు లేకుండా ఉన్నాయని అనుకుంటున్నారా? బ్లడ్ బ్యాంకు విషయానికి వస్తే... బ్లడ్ అమ్ముకుంటున్నాడని అన్నారు. నాకు వచ్చే పారితోషికం (రెమ్యూనరేషన్)తో పోల్చుకుంటే, ఎన్ని ప్యాకెట్ల రక్తం అమ్మితే ఆ డబ్బుకు సమానం చెప్పండి? వాళ్ళు అనే మాట ఎంత మూర్ఖంగా ఉన్నాయి? నేను ఎక్కడా చెయ్యి చాచి డొనేషన్లు తీసుకోకుండా నా కష్టార్జితంతో బ్లడ్ బ్యాంకు నడుపుతున్నాను. దాని వెనుక నేను ఖర్చు చేసేది కొంత. మీరు (ఫ్యాన్స్) సహకరించేది ఎంతో. దాన్ని వేల కట్టలేం. అటువంటి విమర్శలను పట్టించుకోను. నేను అదృష్టాన్ని నమ్మను. కష్టాన్ని నమ్ముకుంటా" అని అభిమానుల సమావేశంలో చిరంజీవి పేర్కొన్నారు. "నేను శ్రీకారం చుట్టిన సేవా యజ్ఞాన్ని అభిమానులు తమ భుజ స్కంధాలపై వేసుకొని శ్రీరాముడి మాటను లక్ష్మణ భరతులు విన్నట్లుగా నిర్వహిస్తున్నారు" అని చిరంజీవి పేర్కొన్నారు. తన విజయాలు, అవార్డుల కంటే అభిమానులు సమాజానికి చేసే రక్తదాన సేవలు, సత్కార్యాల ద్వారా పొందే మానసిక సంతృప్తి, ఆనందమే తనకు ఎంతో మిన్న అని మెగాస్టార్ స్పష్టం చేశారు. "ఓ జాడీలో ముందుగా ఇసుక వేస్తే... అందులో పెద్ద రాళ్లకు చోటు ఉండదు. ఇక్కడ పెద్ద రాళ్లు మన జీవిత లక్ష్యాలు, గమ్యాలు కాగా... ఇసుక రేణువులు అవమానాలు, నెగెటివిటీ, చిన్న చిన్న నిరాశలు. నెగెటివిటీ అనే ఇసుకతో మన మనస్సును నింపేస్తే ప్రధాన లక్ష్యాలను సాధించలేం" అని అభిమానులకు సలహా ఇచ్చారు చిరంజీవి.

# 2012-16 వరకు నంది అవార్డులు

మొదటి పేజీ తరువాయి...

నిర్వహిస్తామని తెలిపారు భరత్ భూషణ్. అదేవిధంగా నంది ఫిల్మ్ అవార్డుల్లో చలనచిత్రాలు, జాతీయ సమైక్యతపై చలనచిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, విద్యా విషయక చిత్రాలు, తెలుగు సినిమాపై రచించిన ఉత్తమ రచనలు తదితర విభాగాలు ఉంటాయన్నారు. ఫిల్మ్ విభాగంలో మొత్తం 46 అవార్డులను అందించనున్నాం. ఉత్తమ ప్రదర్శన, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ సహాయ నటి తదితర విభాగాల్లో అవార్డులు అందిస్తాం. నంది ఫిల్మ్ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులతో పాటు ప్రశంసాపత్రం, నగదు పారితోషికం అందిస్తాం.. వివిధ కేటగిరీలలో 8 గోల్డ్ మెడల్స్ కూడా అందించనున్నాం అని భరత్ భూషణ్ తెలిపారు. అలాగే టెలి చిత్రాలు, టీవీ ఫీచర్స్, టీవీ మెగా సీరియల్స్, టీవీ డైలీ సీరియల్స్, టీవీ బాలల చిత్రాలు, టీవీ డాక్యుమెంటరీ చిత్రాలు, టీవీ సామాజిక సంబంధిత చిత్రాలు, టీవీ విద్యా విషయక చిత్రాలు తదితర విభాగాల్లో అవార్డులు అందిస్తామన్నారు. టీవీ విభాగంలో మొత్తం 48 అవార్డులను అందించనున్నాం.. ప్రథమ, ద్వితీయ ఉత్తమ టెలి ఫిల్మ్, టెలి ఫీచర్స్, మెగా టీవీ సీరియల్, డైలీ టీవీ సీరియల్, టీవీ బాలల చిత్రం తదితర విభాగాల్లో అవార్డులు అందిస్తాం.. ఉత్తమ నటుడు, నటి, సహాయ నటుడు, హాస్య నటుడు, హాస్య నటి, ప్రతినాయకుడు, బాలల నటుడు, నటి, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత తదితర విభాగాల్లో అవార్డులు అందించనున్నాం అని తెలిపారు. నంది టీవీ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులతో పాటు ప్రశంసాపత్రం, నగదు పారితోషికం అందిస్తాం.. తెలుగు సినిమా, టెలివిజన్ రంగానికి చెందిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించడమే నంది అవార్డుల ప్రధాన ఉద్దేశ్యం అని భరత్ భూషణ్ అన్నారు.

ఎన్.టి.ఆర్. నేషనల్ ఫిల్మ్ అవార్డు -- రూ.5 లక్షలు

బి.ఎన్. రెడ్డి నేషనల్ ఫిల్మ్ అవార్డు -- రూ.2 లక్షలు

నాగిరెడ్డి--చక్రపాణి నేషనల్ ఫిల్మ్ అవార్డు -- రూ.2 లక్షలు

రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు -- రూ.2 లక్షలు

జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీతలకు జ్ఞాపిక, సన్మాన పత్రంతో పాటు నగదు పారితోషికం అందిస్తామన్నారు.

# అంత ఖర్మ పట్టలేదు

మొదటి పేజీ తరువాయి...

తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, తన సోదరుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలవడంపై వస్తున్న వదంతులపై షర్మిల క్లారిటీ ఇచ్చారు. గతంలో తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించిన సమయంలోనే తాను సోదరుడు జగన్‌ను చివరిసారిగా కలిశానని తెలిపారు. మళ్లీ ఇప్పుడు కలిసినా తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమే వెళ్తానని వివరించారు. తన కుమార్తె పెళ్లికి రావాలని, దంపతులను దీవించాలని అన్ని రాజకీయ పార్టీల అధినేతలను తాను ఆహ్వానిస్తున్నానని, ఇందులో కొత్తేమీ లేదని, వింత అంతకన్నా లేదని తేల్చేశారు. కూతురు వివాహాన్ని సైతం అడ్డుపెట్టుకుని తెర వెనుక రాజకీయాలు చేసే ఖర్మ దివంగత వైఎస్సార్ బిడ్డగా తనకు లేదని ఘాటుగా స్పందించారు. ఇంటి శుభకార్యానికి, రాజకీయాలకు ముడిపెడుతూ తన విశ్వసనీయతను, రాజకీయ ప్రమాణికతను, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తూ చూస్తూ ఊరుకునేది లేదని షర్మిల హెచ్చరించారు. త్వరలో తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి - సోమల రఘురామ్ రెడ్డి వివాహం సందర్భంగా త్వరలో ఒక్కటి కాబోతున్న ఈ నవదంపతులకు తెలుగు ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీస్సులు అందించాలని ఆమె కోరారు.

## మతాల మధ్య వైషమ్యాలు పెంచడం

# రాధాకృష్ణకు వెన్నతో పెట్టిన విద్య

### బొల్లవరపు జాన్ వెస్లీ

**విశాఖపట్నం జయ జయహే**

దొండపర్తి వైయస్సార్సీపి కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ రాస్తున్న తొలి పలుకులు ఆయన చరమాంక జీవితానికి చావు కేకలుగా మారుతున్నాయి అని,ఆయన వేస్తున్న కేకలు పత్రికారంగాన్ని కించపరుస్తూ, పత్రికా విలువలకే ఒక మాయని మచ్చగా ఉన్నాయని తెలియజేశారు. సమాజంలో శాంతిని, సామరస్యాన్ని, ఐక్యతను దెబ్బతీస్తూ పత్రికా రంగాన్ని ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉన్నాయి అన్నారు. పత్రికలు అంటే సమాజానికి దర్పణం లా ఉండాలి కానీ తమ సొంత ప్రయోజనాల కోసం తమకున్న కులగజ్జిని ఇతరులకు రుద్దే విధంగా ఒకరికి కొమ్ముకాస్తూ, మరొకరిపై విషం చిమ్మే విధంగా ఉండకూడదు అన్నారు. ఏబీఎన్ రాధాకృష్ణ ,చంద్రబాబు నాయుడుకు జీవితకాలం అధికారంలో ఉండేలా చేయడం కోసం, ఆయనకు ఊడిగం చేస్తూ జగన్మోహన్ రెడ్డి ని చెడుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు అని, మీ రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చు పెడుతూ జగన్మోహన్ రెడ్డి ని కించపరిచేలా చేస్తే మీ కథనాలు నమ్మడానికి ఈ రాష్ట్రం లోని ప్రజల సిద్ధంగా లేరు అని తెలిపారు. ఆకాశం వైపు తిరిగి ఉమ్ము వేస్తే అది తిరిగి మీ ముఖం పైనే పడుతుంది అనే ఇంగిత జ్ఞానం కూడా మీకు లేకుండా తెగించి వార్తలు రాస్తున్నారు. ఇలాంటి వార్తలు మీ వినాశనానికే దారితీస్తాయి, ఈ రెండు సంవత్సరాల కాలంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు జగన్మోహన్ రెడ్డి వెనక ఒక సైన్యంలా నిలబడ్డారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్లో గాని దక్షిణాది రాష్ట్రాలలో గాని క్రైస్తవ్యం బలవంతంగానో కుట్రలతోనా బలపడలేదు అని తెలియజేస్తూ, క్రైస్తవ్యమంటే నిన్ను వలే నీ పొరుగు వానిని ప్రేమించడం అని, కష్టాలలో ఉన్న వారికి సహాయం చేయడం, అణచివేతకు గురైన వర్గాల వారిని అక్కున చేర్చుకొని ప్రేమ, దయ, కరుణ , ఆదరణ చూపిస్తూ వారికి సేవ చేయడమే క్రైస్తవ్యం అని తెలియజేస్తూ. విద్యా,వైద్య రంగాలలో క్రైస్తవ సంస్థలు భారతదేశానికి చేసిన సేవలను మీరు మరిచిపోయి దానికి మతం రంగు పూస్తూ రాజకీయం చేయడం మీయొక్క దుష్ట మనస్తత్వానికి నిదర్శనం అని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆయన చేసిన మంచి పనులు, అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కుల, మత ప్రాంతాలకతీతంగా అన్ని వర్గాల వారికి అందించడం వలన అవి ప్రతి పేద వాడి ఇంటికి చేరాయి అని తెలియజేశారు. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని మరలా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడం ఖచ్చితం అని ప్రజల నుంచి సంకేతాలు వస్తున్న ఈ సందర్భంలో జగన్మోహన్ రెడ్డి కి ప్రజల్లో వస్తున్న ఆదరణను అభిమానాన్ని చూచి ఓర్వలేక ఇప్పుడు మతాన్ని అడ్డం పెట్టుకొని మరల జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకుండా చేసే విధంగా బురద జల్లుతున్నారు. పేద పిల్లలు ఇంగ్లీష్ చదువులు చదువుకోవడం, ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయిలో చదువును అందించడం వలన మీ వందిమాగదుల కార్పొరేట్ కళాశాలలు మరల మూతపడతాయని భయంతో జగన్మోహన్ రెడ్డి కి చెడు చేసే ప్రయత్నం ఒక పథకం ప్రకారం ఈ పచ్చ మీడియా ద్వారా జరుగుతున్నది అని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ది ఒకే మతం అదే మానవత్వం. అన్ని మతాలను గౌరవిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఆయన హయాంలో ఎంతగా అభివృద్ధి చేశారో మరియు ముస్లింలకు ఏ విధమైన చేశారోఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజాదరణ కోల్పోతున్న కూటమి ప్రభుత్వం వారికి వత్తాసు పలికే పచ్చ మీడియా సంస్థలు మళ్లీ పాతదారిలోనే ప్రయాణిస్తున్నాయి. రాజకీయంగా జగన్మోహన్ రెడ్డి ని ఎదుర్కొనలేక కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి మతాన్ని మతవిశ్వాసాలను ఆయుధంగా వాడుకోవడం ఈ పచ్చ పత్రికలు అలవాటుగా మారింది అని ఎన్నికలు అయిన తర్వాత కూడా ఏదో ఒక కొత్త వివాదాన్ని సృష్టించి మతాల మధ్య వైషమ్యాలు పెంచడం రాధాకృష్ణకు వెన్నతో పెట్టిన విద్య అని తెలియజేశారు. ఈ రాష్ట్రంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా అది రాజకీయ కోణంలోకి లాగి దానిని జగన్మోహన్ రెడ్డి కి సంబంధం ఉన్నట్లు చూపించడం ఈ పచ్చపత్రికలకు నిత్య కృత్యంగా మారింది. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న తీవ్ర అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి ఈ డైవర్షన్ కథనాలు తెరపైకి తీసుకువచ్చారు అని తెలియజేశారు. రేపు రాబోయే ఎన్నికలలో ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో ఈ పచ్చపత్రికలకు కూటమి నాయకులకు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉన్నది అని తెలియజేశారు.





## ఘాట్ రోడ్డు క్లోజ్..!

మొదటి పేజీ తరువాయి...

కొండ చరియలు విరిగిపడకుండా భద్రతా చర్యలు, వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఘాట్ రోడ్డు బంద్ ఉన్న సమయంలో భక్తులు, వాహనదారులు కింద తెలిపిన ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని దుర్గగుడి ఈవో సీనా నాయక్ విజ్ఞప్తి చేశారు. ఘాట్ రోడ్డు గుండా ఎలాంటి ద్విచక్ర వాహనాలు, కార్లు లేదా ప్రైవేట్ వాహనాలను కొండపైకి అనుమతించరు. కాలినడకన, వాహనాల్లో వచ్చే భక్తులందరూ శ్రీ కనకదుర్గ నగర్ గుండా మాత్రమే ఇంద్రకీలాద్రిపైకి చేరుకోవాల్సి ఉంటుంది. దసరా ఉత్సవాల దృష్ట్యా విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, ఇతర జిల్లాల, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం ట్రాఫిక్ పోలీసులు, దేవస్థానం అధికారులు సమగ్ర పార్కింగ్ ప్రణాళికను రూపొందించారు. హైదరాబాద్, సూర్యాపేట, నందిగామ మార్గాల నుంచి వచ్చే భక్తుల వాహనాల కోసం పున్నమి ఘాట్ వద్ద విస్తృత పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పున్నమి ఘాట్ నుంచి భక్తుల కోసం దుర్గగుడి దేవస్థానం ఉచిత బస్సు సౌకర్యాన్ని అందిస్తుంది. విశాఖపట్నం, ఏలూరు, రాజమండ్రి, చెన్నై, గుంటూరు ప్రాంతాల నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలను సీతమ్మవారి పాదాలు, కృష్ణా నదీ తీర ప్రాంత పార్కింగ్ స్థలాల్లో నిలపాల్సి ఉంటుంది. ఇక్కడి నుంచి కూడా ఆలయ సమీప ప్రాంతం వరకు ఉచిత బస్సులను నడుపనున్నారు. విశాఖపట్నం, చెన్నై, ఇతర ప్రాంతాల నుండి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మార్గం ద్వారా వచ్చే భక్తులు తమ వాహనాలను సీతమ్మ వారి పాదాల వద్ద నిలపాలి. పార్కింగ్ ప్రాంతం నుండి ఆలయం వరకు ఉచిత బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయి.' అని ఈవో సీనా నాయక్ చెప్పారు. ఈ సందర్భంగా ఈవో సీనా నాయక్ మాట్లాడుతూ.. 'దసరా ఉత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారు. ఘాట్ రోడ్డు ప్రయాణం భక్తుల రక్షణ దృష్ట్యా అత్యంత కీలకమైనది. కాబట్టి ఎక్కడా ప్రమాదాలు జరగకుండా, ప్రయాణం సురక్షితంగా ఉండేందుకు రోడ్డు రక్షణ గోడల బలోపేతం, కొండచరియల నెట్ అమరిక, ప్యాచ్ వర్క్ పూర్తి చేస్తున్నాం. భక్తులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి, కేటాయించిన పార్కింగ్ స్థలాల వద్దే వాహనాలు నిలిపి, ఉచిత బస్సు సేవలను వినియోగించుకోవాలి.' అని ఈవో కోరారు. భక్తులకు తాగునీరు, నీడ, క్యూలైన్లలో ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అమ్మవారి దర్శనం సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని ఈవో సీనా నాయక్ వివరించారు.

## కళింగ వైశ్యులకు రాజకీయ ప్రాధాన్యత, అందించింది వైయస్ జగన్

### రాష్ట్ర సిఇసి సభ్యులు అంధవరపు సూరిబాబు

**శ్రీకాకుళం (జయ జయహే )**



రాష్ట్రంలో 139 బీసీ కులాలున్నాయని అధ్యయనం చేసి, ఏలూరు బీసీ గర్జనలో బీసీ డిక్లరేషన్ చేసి, బిసిలంటే వెనుకబడిన వారు కాదని వెన్నెముకలాంటివారని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారని, బీసీలు ఎంతోమందికి రాజ్యాధికారం కల్పించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యులు అంధవరపు.సూరిబాబు అన్నారు. కళింగ వైశ్య కులానికి మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో కళింగ వైశ్య బీసీ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్త గౌరవాన్ని అందించింది జగన్మోహన్ రెడ్డి అని గుర్తుచేశారు. శ్రీకాకుళం జిల్లాలో సుడా చైర్మన్ పదవిని కళింగ వైశ్య మహిళా నేత కోరాడ.ఆశాలతకు ఇచ్చి గౌరవించారని, నలుగురు బిజినెస్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా వైవి రమణ, తంగుడు జ్యోతి, భోగి.లత, టి.విశ్వేశ్వరరావులను నియమించి కళింగవైశ్య కులం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. ఇప్పుడు కళింగ వైశ్య రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన బోయిన గోవిందరాజులు, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆ పదవులకు ప్రాణం పోసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై అక్కసు వెలగట్టడం అత్యంత దారుణమన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో 56 బీసీ కార్పొరేషన్ చైర్మన్ లు, 672 కార్పొరేషన్ డైరెక్టర్లను నియమించారన్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం మీ ప్రభుత్వంలో ఎంతమందికి ఇలాంటి పదవులు ఇచ్చారని అంధవరపు సూరిబాబు ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి మానస పుత్రిక అయిన కుల కార్పొరేషన్ ఆలోచన మీకు ఈరోజు రాజకీయ పునరావాసాన్ని ఇచ్చిందని గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా అనవసర విమర్శలను పక్కనపెట్టి కులంలో పేదరికాన్ని నిర్మూలించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఏవైతే కులాలను రాష్ట్రంలో బీసీలుగా చేశారో, అవి కేంద్రంలో ఓబీసీ హోదాకు నోచుకోలేదని, నాటి ముఖ్యమంత్రి గా జగన్మోహన్ రెడ్డి ఈ కులాలన్నింటిని ఓబీసీలుగా చేయాలని బీసీ ముఖ్య కార్యదర్శి అనంతరామ్ ఐఏఎస్ ద్వారా కేంద్రానికి సిఫారసు చేయించడాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఢిల్లీలో దీనిపై పబ్లిక్ హియరింగ్ సైతం జరగడానికి ఆనాటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే కారణమనే విషయం మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. వ్యర్థ విమర్శలు మానుకొని, ఈరోజు రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ మీ ప్రభుత్వం ఉంది గనుక కళింగ వైశ్యులకు న్యాయం చేయాలని బోయిన గోవిందరాజులు బృందానికి అంధవరపు సూరిబాబు సూచించారు.



## దళితులపై కక్ష పూరిత దాడిని ఖండించిన ప్రజా సంఘాలు

### జ డ్యాడ దళితుల కు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

### దళిత ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్

**టెక్కలి సెప్టెంబర్ 22 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం కొత్త అగ్రహారం పంచాయతీ లోని జ డ్యాడ గ్రామ దళితులపై గత 16వ తేదీ రాత్రి దారి కాచి దారుణంగా దాడి చేయడం బాధాకరమైన సంఘటనని దీనిపై దళిత ప్రజా సంఘాల జేఏ సి నిజ నిర్ధారణ కమిటీ ప్రతినిధు లు జ డ్యాడ గ్రామాన్ని పర్యటించి స్థానిక దళితులను కలిసి జరిగిన సంఘటనపై వాస్తవాలను సమగ్రంగా పరిశీలన చేశారు, గ్రామంలో దళితుల ఆర్థిక అభివృద్ధి, రాజకీయ ఎదుగుదల, కుల వివక్షత యువకుల్లో ప్రశ్నించే తత్వం ఉందనే అక్కసుతో అగ్రకుల ఆదిపత్యంతో కక్షపూరిత దాడిని చేశారని దళిత బాధితులు కమిటీ వద్ద ఆరోపించారు. భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వము దళితులకు గ్రామములో తగిన రక్షణ కల్పించి చట్ట పరంగా ఆదుకోవాలని పలువురు దళితులు విజ్ఞప్తి చేసినట్లు నిజ నిర్ధారణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు, ఈ పర్యటనలో కుల వివక్షత పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు, కుల విపక్షత పోరాట సమితి ప్రతినిధి బెలమర ప్రభాకరరావు, వి ద సం సభ్యులు ఎడ్ల గోపి, జే సి ఎం ప్రతినిధి దమయంతి, దళిత నాయకులు ఆ క్కు రాడ లోకనాథం, బాధితుల సంఘం ప్రతినిధి రాకోటి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింధూర అలంకరణలో స్వయంభూ

**చోడవరం సెప్టెంబర్ 22 జయ జయహే**

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరం స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు లో మంగళవారం స్వామివారు సింధూర అలంకరణ లో కార్యసిద్ధి గణపతిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి చందన పూజ, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింధూర వర్ణం లో గల స్వామివారిని అనేకమంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే హోమం కూడా నిర్వహించారు.






## కొయ్యూరులో జనసేన అత్యవసర భేటీ..

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 23,**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొయ్యూరు మండలంలో జనసేన పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించనుంది. అరకు – పాడేరు జనసేన పార్టీ ఇంచార్జ్, జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు ఈ సమావేశం జరుగనుంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు సాగిన బుజ్జిబాబు నివాసంలో సమావేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ, ఏయే ప్రాంతాల్లో అభ్యర్థులను నిలబెట్టాలి, పోటీ చేసే ఆశావహుల ఎంపిక, ముఖ్య నాయకుల సూచనలపై చర్చించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ అత్యవసర సమావేశానికి అరకు పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కీలక కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని అరకు పార్లమెంట్ స్థానిక సంస్థల కో–ఆర్డినేటర్ సెగ్గె భవన జయంతి, కొయ్యూరు మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్ లు పిలుపునిచ్చారు.



## ఘనంగా లక్ష బిల్వార్చన

**మాడుగుల సెప్టెంబర్ 22, జయ జయహే**

గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మాడుగుల మూడో రోజు జంక్షన్లో శ్రీ బాల వినాయక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఏకాదశి పరిష్కరించుకొని మంగళవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం లక్ష బిల్వార్చన కార్యక్రమము ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాటంకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి మాలలు ధరించిన స్వాములు ఈ పూజలో పాల్గొన్నారు. వర్షం పడుతున్న సరే అనేక మంది భక్తులు హాజరై పూజలు తిలకించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ యాడాది పుట్ట రవిచంద్ర కిషోర్ దంపతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో పాటు పలువురు దాతలను కూడా సత్కరించారు. బుధవారం స్వామివారి నిమజ్జన్న కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.



## బాల వినాయకుని లడ్డు ఊరేగింపు

**మాడుగుల సెప్టెంబర్ 22 జయ జయహే**

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాడుగుల మూడో రోజు జంక్షన్లో బాల వినాయక యువజన సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి లడ్డు ప్రసాదశీ ఊరేగింపు నిర్వహించారు. వర్షం పడుతున్న సరే గణపతి స్వాములు అందరూ కలిపి 11 కేజీల లడ్డు ప్రసాదాన్ని ఊరేగించి స్వామివారికి సమర్పించారు. అనంతరం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

For a pure tomorrow.. జయహే



## పొలం పిలుస్తుంది కార్యక్రమం

**బుచ్చియ్యపేట జయ జయహే**

మండలంలోని విజయరామరాజుపేట మంగళాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో క్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి మల్ల నారాయణరావు పొలాలను పరిశీలించారు. గత వారం రోజుల నుండి కురుస్తున్న వానలు కారణంగా రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేయడం జరుగుతుంది దీనికి అనుగుణంగా రైతులు 70 రోజులు పైబడి ఉన్న నారుని నాట్లు వేయడం జరుగుతుంది ఈ విధంగా వేసిన నారును తగు జాగ్రత్తలు తీసుకొని వెయ్యడం మంచిదని సూచించచారు. అదేవిధంగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ జిల్లా కలెక్టర్ మరియు వ్యవసాయ శాఖ హెచ్చరించడం జరుగుతుంది . ఈ నేపథ్యంలో రైతులు ఇప్పటివరకు నాట్లు వేసిన పొలాలుగాను ఎటువంటి మందులు పిచికారి మరియు ఎరువులు వేయొద్దని తెలిపారు .సూచించడం పల్లపు ప్రాంతాలు ఉన్న పరిపలాల్లో మీరు చేరినట్లయితే రైతులు ఎప్పటికప్పుడు గమనించి నీరు తీసివేయాలని రైతులకు సూచించారు.అదేవిధంగా ఈ వర్షాభావ ప్రభావం వల్ల పొలాలకు ఎటువంటి ఆటంకం కలిగిన మీ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రం సిబ్బందిని గాని మండల వ్యవసాయ అధికారిని గాని సంప్రదించవలెనని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీ విద్య, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.




## రైతులకు ఊరటనిచ్చిన వర్షం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 23,**

కొయ్యూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఇవాళ రాత్రి, రేపు కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కొనసాగే అవకాశం ఉంది,ప్రస్తుతం కొయ్యూరులో 26 డిగ్రీల ఉష్ణోగ్రత, 95% తేమ నమోదవుతోంది. రాత్రి 7:30 నుంచి తెల్లవారుజాము వరకు 90% కంటే ఎక్కువ వర్ష సూచన ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు కూడా రోజంతా వర్షం 100% కురిసే అవకాశం ఉంది. ఈ వర్షాలతో గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అమృత హస్తం-ఆయుర్వేద ప్రాణం-శ్రీ ధన్వంతరి వైభవం

**సెప్టెంబర్ 23 జాతీయ ఆయుర్వేద దినోత్సవం ప్రత్యేక శీర్షిక**




ఓం వాసుదేవాయ విద్మహే వైద్యరాజాయ ధీమహి తన్నో ధన్వంతరి ప్రచోదయాత్...

ఈ మంత్రాన్ని ఔషధములు ఉపయోగించే ముందు మూడుసార్లు చదివితే ఔషధం పది రెట్లు ఫలితం ఇస్తుందని ఆయుర్వేదంలో నమ్మకం.

భారతీయ సంస్కృతిలో వైద్యానికి దేవుడు ఉన్నాడు ఆయనే శ్రీ ధన్వంతరి ఆయుర్వేదం అనే మహా వృక్షానికి ఆయనే విత్తనం. ఆయుర్వేదం అనగా ఆయు అంటే జీవితం, వేద అంటే జ్ఞానం, అంటే జీవితాన్ని ఎలా బతకాలో చెప్పేది ఆయుర్వేదం. ఆ ఆయుర్వేద పితామహుడే ధన్వంతరి.

**ధన్వంతరి జననం**

క్షీరసాగరాన్ని దేవతలు రాక్షసులు మందర పర్వతాన్ని వాసుకి అనే పాము చేత మధిస్తూ ఉన్న సమయంలో క్షీర సాగరం నుండి 14 పదార్థములు బయటకు వచ్చాయి. ప్రారంభంలో హాలహాలం తర్వాత కొన్ని పదార్థాలు లక్ష్మీదేవి, సూర్యచంద్రులు, కల్పవృక్షం,ఐరావతం, చివరలో చేతిలో అమృత కలశంతో తెల్లని వస్త్రాలతో మెడలో తులసి మాలతో ఒక దివ్య పురుషుడు పైకి లేచి దర్శనమిచ్చాడు. ఆయనే,ధన్వంతరి. ఈయన విష్ణు యొక్క అంశ దేవతల యొక్క వైద్యుడు ఆయన చేతిలో అమృతం తాగితే రోగాలు పోయి ఆయువు పెరుగుతుంది. ఆ అమృత విద్యనే ఆయుర్వేదం అంటారు.

**ధన్వంతరి పుట్టుక వెనుక కథ**

దుర్వాస మహర్షి శాపం వలన ఇంద్రుడు దేవతలు శక్తిని కోల్పోయారు 1000 సంవత్సరాలు క్షీరసాగరాన్ని మదించి చాలా కష్టపడ్డారు అందులో నుండి ఉద్భవించే అమృతాన్ని స్వీకరిస్తే తిరిగి శక్తి పొంజుకుంటుంది అని చెప్పారు. ధన్వంతరి అమృత కలశం తో బయటకు రాగానే రాక్షసులుగా కలశాన్ని ఎత్తుకు వెళ్ళిపోయారు విష్ణువు జగన్మోహిని అవతారంలో ప్రత్యక్షమై ఈ అమృత కలశాన్ని తెచ్చి అమృతాన్ని దేవతలు అందరికీ పంచిపెట్టారు.

మొదటి జన్మలో ధన్వంతరి రూపం

ధన్వంతరి అత్యంత మహిమోపేతమైన రూపంలో సుందర దరహాసంతో అందరికీ దర్శనం ఇచ్చారు. నాలుగు చేతులు. ఒక చేతులో అమృత కలశం మరొక చేతిలో శంఖం, మరొక చేతిలో చక్రం, మరొక చేతిలో మూలికతో దర్శనం ఇచ్చారు.

రెండవ జన్మలో ధన్వంతరి రూపం

పురాణాల ప్రకారం ఆయన మళ్లీ కాశీ రాజు దేవదాసు గా ధన్వంతరి గా పుట్టి సుశ్రుతుడికి ఆయుర్వేదం నేర్పాడు. సుశ్రుత సంహితలో ఈయన ఆయుర్వేద వైద్యం శస్త్రచికత్స గురించి ప్రత్యేక విధానాన్ని తెలిపారు.

ఆయుర్వేదం కు ధన్వంతరీకి మధ్య సంబంధం

మూలపురుషులు బ్రహ్మ నుండి ఆయుర్వేద జ్ఞానం దక్ష ప్రజాపతికి అక్కడి నుండి అశ్విని దేవతలకు అక్కడనుండి ఇంద్రుడికి వచ్చింది. ఇంద్రుడు దానిని ధన్వంతరికి ఇచ్చాడు.

ఆయుర్వేద విద్యను స్వర్గం నుండి భూమికి తెచ్చింది ధన్వంతరీ

స్వర్గంలో ఉన్న ఆ వైద్య విద్యను భూమికి తెచ్చినది ధన్వంతరే. తన శిష్యులైన సుశ్రుతుడుకు, చరకుడుకు ఆయుర్వేద విద్యతోపాటు శస్త్ర చికిత్సలను నేర్పిన వారు ధన్వంతరి మహా పురుషుడే. అందుకే ధన్వంతరిని ఆయుర్వేద పితామహుడు అని అంటారు.

ఆయుర్వేదం అనగా ఆయువు(జీవితం),వేదం (జ్ఞానం) అనగా మన జీవితానికి జ్ఞానాన్ని ప్రసాదించి ఇచ్చేది. ధన్వంతరి చేతిలోని అమృత కలశం ఆయన పెంచుతుంది కనుక ఆయనే ఆయుర్వేదానికి ప్రత్యక్ష దేవుడు.

**ఆయుర్వేదానికి పునాది మూడు దోషాలు**

పంచభూతాలు

మన శరీరాన్ని ఐదు పదార్థాలు తో అనగా భూమి నీరు, వాయువు , అగ్ని, ఆకాశం ద్వారా మానవ శరీరాన్ని, దేవుడు నిర్మితంగా భావించాలి.

ఆయుర్వేదంలో చికిత్సలు రెండు రకాలు.

శోధన చికిత్స

శరీరంలో పెరిగిపోయిన మలినాన్ని అనగా విషయాన్ని బయటకు తీయడం.

1. వమనం చేయించడం ఆస్తమాకు తగ్గుటకు జరిగే ప్రక్రియ.
2. విరోచనం జీర్ణక్రియ మెరుగుపరచడం.
3.బస్తీ 80 రోగాలకు రాజు ఇది.
4.,నస్యం ముక్కులో నూనె వేయడం.
5. రక్త మోక్షణం చెడు రక్తాన్ని జలగతో తీయడం.

శమన చికిత్స

శరీరం లోపల నుండి తగ్గించడం. శరీరంలో ఉన్న విషయాన్ని త్రిఫల చూర్ణం అశ్వగంధ బ్రహ్మీతో వైద్యం చేయడం.

ఆయుర్వేదంలో అతి ముఖ్యమైన అష్టాంగ చికిత్సలు

1. కాయ చికిత్స జ్వరం,విరోచనాలకు చికిత్స.
2. బాల చికిత్స
పిల్లలకు నలత గా ఉంటే నయం చేసే చికిత్స.
3. గ్రహ చికిత్స
మానసికంగా కుంటనానికి లోనైన వ్యక్తులకు చేసే చికిత్స.
4. శాలాక్యా
కంటిలో ఉన్న సమస్యలకు చెవి ముక్కు సమస్యలకు అందించే చికిత్స.
5. శల్య తంత్రం
మొట్ట మొదట సారిగా సుశ్రుతుడు శస్త్ర చికిత్స చేశాడు. ఎముకలు విరిగినప్పుడు కత్తితో గాయాలైనప్పుడు వివిధ రకాలైన ఇతర శరీర గాయాలకు శాస్త్ర చికిత్స చేసి తగ్గించే చికిత్స.
6. దంస్ట్రా చికిత్స/ అగద చికిత్స
సర్పము, తేలు ఇతర విషపూరితమైన జీవులు కాటు వేస్తే దానికి విరుగుడుగా చేసే చికిత్స.
7.,జరా చికిత్స / రసాయన చికిత్స
చావ్యన జీవన ప్రాశ్ అశ్వగంధ ఆమ్లా చికిత్స వృద్ధాప్య ఛాయలు తగగ్గించి యవ్వన ఛాయను పెంచే చికిత్స.
8.వృష చికిత్స / వశీకరణ తంత్ర

**వీర్య వృద్ధి, సంతానం కోసం శారీరక శక్తిని పెంచే చికిత్స.**

ఈ అష్టాంగ చికిత్సలు ఎం.బి.బి.ఎస్ లో ప్రత్యేకంగా చేసే కోర్సులు లాంటివి. ఐదువేల సంవత్సరాల క్రితం వీటిని విభజన చేయడం జరిగింది.

మానవవులకు చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వస్తే పంచకర్మ పద్ధతుల ద్వారా శారీరక అలసటను పోగొట్టే తైల మర్దన ద్వారా అనారోగ్యాన్ని ఆరోగ్యంగా మార్చుకోవాలనేదే ఆయుర్వేద సిద్ధాంతము. ఆయుర్వేదంతోనే ఆరోగ్యం లభిస్తుంది. ఆయుర్వేద అంటే ఆరోగ్య ప్రదాత అని అందరూ తెలుసుకుని, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తూ ఆరోగ్యవంతులుగా ముందుకు నడుద్దాం..

**రచన..**
**ఏ బాల సౌజన్యకుమారి**
**తెలుగు ఆచార్యులు, నంది అవార్డు గ్రహీత**
**ఆధ్యాత్మికవేత్త,ప్రవచనకర్త**

# ఏఐ దూసుకెళ్తోంది కానీ భద్రత వెనుకబడుతోంది

(ప్రతాప్)

**కృత్రిమ మేధ ఇక కేవలం సాంకేతిక పరిజ్ఞానం కాదు. ఆర్థికాభివృద్ధి, శాస్త్రీయ పరిశోధన, సైబర్ భద్రతతో పాటు జాతీయ భద్రతకు కూడా ఇది కీలక సాధనంగా మారుతోంది. ముఖ్యంగా అమెరికా, చైనా మధ్య సాంకేతిక ఆధిపత్య పోటీ వేగం పెరుగుతున్న కొద్దీ కృత్రిమ మేధ సామర్థ్యాల అభివృద్ధి వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ పోటీ వేగం భద్రతా ప్రమాణాల రూపకల్పనను వెనక్కి నెట్టే ప్రమాదం ఉంది.**




ప్రమాదాలు ఇప్పటికే ఊహాజనిత స్థాయిని దాటుతున్నాయి. కృత్రిమ మేధను సైబర్ దాడులు, మోసాలు, తప్పుడు సమాచార వ్యాప్తి వంటి కార్యకలాపాల్లో దుర్వినియోగం చేస్తున్న ఆధారాలు పెరుగుతున్నాయని 2026 అంతర్జాతీయ కృత్రిమ మేధ భద్రతా నివేదిక పేర్కొంది. అత్యంత అభివృద్ధి చెందిన కృత్రిమ మేధ వ్యవస్థల విషయంలో హానికర సామర్థ్యాలను విడుదలకు ముందే విశ్వసనీయంగా గుర్తించడం కూడా కష్టమవుతోందని నివేదిక హెచ్చరించింది.

ఇక్కడే ప్రపంచానికి అసలు సవాలు ఎదురవుతోంది. ఒక దేశం భద్రత కోసం అభివృద్ధి వేగాన్ని తగ్గిస్తే ప్రత్యర్థి దేశం ముందుకు వెళ్లిపోతుందనే భయం ప్రభుత్వాలను వెంటాడుతోంది. ఫలితంగా 'ముందుగా ఎవరు సాధిస్తారు?' అనే పోటీ 'ఎలా సురక్షితంగా అభివృద్ధి చేయాలి?' అనే ప్రశ్నను వెనక్కి నెట్టవచ్చు. అదే సమయంలో కృత్రిమ మేధ సామర్థ్యాలు దేశ సరిహద్దులతో ఆగవు. ఒకసారి శక్తివంతమైన నమూనా విస్తృతంగా అందుబాటులోకి వస్తే దాని దుర్వినియోగాన్ని నియంత్రించడం క్లిష్టమవుతుంది. ముఖ్యంగా ఓపెన్-వెయిట్ నమూనాలను విడుదల చేసిన తర్వాత వాటిని వెనక్కి తీసుకోవడం సాధ్యం కాకపోవడం ప్రత్యేక సవాలుగా మారుతోంది.

అందువల్ల పరిష్కారం కృత్రిమ మేధ అభివృద్ధిని పూర్తిగా నిలిపివేయడం కాదు. అభివృద్ధి కొనసాగుతూనే కనీస అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలను అమలు చేయడం అవసరం. అత్యంత ప్రమాదకర సామర్థ్యాలున్న వ్యవస్థలకు తప్పనిసరి భద్రతా పరీక్షలు, రెడ్-టీమ్ పరిశీలనలు, సంఘటనల నివేదికలు, మానవ పర్యవేక్షణ వంటి ప్రమాణాలను దేశాలు పరస్పరం అంగీకరించాలి. ఇప్పటికే కొన్ని సంస్థలు స్వచ్ఛంద భద్రతా విధానాలను ప్రకటించినప్పటికీ వాటి పరిధి, ప్రమాణాలు, అమలు విధానాల్లో గణనీయమైన తేడాలు ఉన్నాయని అంతర్జాతీయ నివేదిక చెబుతోంది.

అంతర్జాతీయ సహకారానికి మరో ముఖ్యమైన అంశం సమాచార భాగస్వామ్యం. ప్రమాదకర సామర్థ్యాలు గుర్తించినప్పుడు వాటి గురించి ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు పరస్పరం సమాచారం పంచుకోవాలి. అధునాతన కంప్యూటింగ్ వనరులు, అత్యంత శక్తివంతమైన చిప్‌ల వినియోగంపై పారదర్శకత పెంచడం కూడా అవసరం. అయితే ఇటువంటి చర్యలు సాంకేతిక పురోగతిని అడ్డుకునేలా కాకుండా, అధిక ప్రమాదం ఉన్న వినియోగాలను గుర్తించి నియంత్రించేలా ఉండాలి.

కృత్రిమ మేధలో భద్రత అనేది అభివృద్ధికి ప్రత్యామ్నాయం కాదు; స్థిరమైన అభివృద్ధికి పునాది. యూరోపియన్ యూనియన్, జీ7, చైనా తదితర ప్రాంతాల్లో పారదర్శకత, ప్రమాద అంచనా, సంఘటనల నివేదికలపై వివిధ పాలనా ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఇంకా పూర్తిగా ఏర్పడలేదు.

భౌగోళిక రాజకీయ పోటీ ముగిసే వరకు భద్రత కోసం వేచి ఉండటం సాధ్యం కాదు. అదే సమయంలో భద్రత పేరుతో సాంకేతిక పురోగతిని నిలిపివేయడం కూడా వాస్తవిక పరిష్కారం కాదు. ప్రపంచం ఎంచుకోవాల్సింది అభివృద్ధి లేదా భద్రత మధ్య కాదు---బాధ్యతాయుతమైన అభివృద్ధి మార్గం మరియు నియంత్రణలేని ప్రమాదం మధ్య. కృత్రిమ మేధ పోటీ ఇప్పటికే ప్రారంభమైంది. కనీస భద్రతా నియమాలు మాత్రం పోటీ కంటే ముందే రావాలి.




## ప్రత్యక్ష అనుభవాలతోనే నైపుణ్యాభివృద్ధి

**విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాక్టికల్ లెర్నింగ్ ఎంతో కీలకం**

**డాక్టర్ బుల్లయ్య కాలేజీ కరెస్పాండెంట్ జి. మధు కుమార్**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 21, జయ జయహే :**

విద్యార్థులకు తరగతి గదిలో అందించే సైద్ధాంతిక విద్యతో పాటు పరిశ్రమల్లో అవసరమైన ప్రత్యక్ష నైపుణ్యాలను అందించేందుకు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ జి. మధు కుమార్ తెలిపారు. విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యను మరింత బలోపేతం చేసి, వారి భవిష్యత్ అవకాశాలను మెరుగుపరచడమే యాజమాన్యం లక్ష్యమని పేర్కొన్నారు.సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం కళాశాలలో నిర్వహించిన 'ఎక్స్‌పీరియెన్షియల్ అండ్ ప్రాక్టికల్ లెర్నింగ్' కార్యక్రమంలో భాగంగా గోడ నిర్మాణ సాంకేతికతలపై చేతిపనితో కూడిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతి గదుల్లో నేర్చుకున్న సిద్ధాంతాలను వాస్తవ నిర్మాణ విధానాలతో అనుసంధానం చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ జి. మధు కుమార్ మాట్లాడుతూ, కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు స్వయంగా పనిని చేసి నేర్చుకున్నప్పుడే ఆ జ్ఞానం మరింత బలపడుతుందని అన్నారు. ఇలాంటి అనుభవపూర్వక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు, భవిష్యత్‌లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని అవకాశాలను కల్పించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. దీపక్ చౌదరి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో క్రమశిక్షణతో కూడిన విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.టి. నాయుడు మాట్లాడుతూ ప్రాక్టికల్ విధానంలో నేర్చుకున్న జ్ఞానానికి విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, సృజనాత్మకతను జోడిస్తే వృత్తిపరమైన అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. గోడ నిర్మాణ సాంకేతికతలకు సంబంధించిన వివిధ అంశాలను విద్యార్థులు స్వయంగా పరిశీలించి, ఆచరణలో పెట్టి నేర్చుకున్నారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రజా సేవలో అంకితభావంతో పని చేశాం





### సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

### భావోద్వేగాల నడుమ సాగిన ఆఖరి సర్వసభ్య సమావేశం

### హాజరైన ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి

**విశాఖపట్నం, సెప్టెంబర్ 22, జయ జయహే**

: విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించడం తనకు ఎంతో సంతృప్తిని, మధురమైన అనుభూతిని కలిగించిందని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఈ ఐదేళ్లలో సమష్టిగా కలిసి ప్రజా సేవలో అంకితభావంతో పని చేశామన్నారు. 2021 సెప్టెంబర్ 24న తనతో పాటు జడ్పీటీసీ సభ్యులు, వైస్ చైర్మన్లు ఎన్నికై, ఐదేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ ఆఖరి సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చరిత్ర కలిగిన విశాఖపట్నం జిల్లా పరిషత్‌లో జడ్పీటీసీ సభ్యులు, వైస్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సభను నిర్వహించుకోవడం ఒక మంచి ఆనవాయితీగా కొనసాగిందని గుర్తు చేశారు. ఈ సమావేశం మన చివరిది కావడం కొంత బాధగా ఉన్నప్పటికీ, పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాల విభజన జరగడం సహజమైన ప్రక్రియ అని అన్నారు. జిల్లాలు విడిపోయినా ప్రజాసేవ విషయంలో మనమంతా కలిసే ఉంటామని సుభద్ర స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ వేదికగా గ్రామ స్థాయి నుంచి వచ్చిన అనేక సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమం తదితర అంశాలపై జిల్లా పరిషత్ సమావేశాల్లో సమగ్రంగా చర్చించామని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ వేదిక ఎంతో దోహదపడిందన్నారు. ఇక్కడ ప్రస్తావించిన సమస్యలు, అంశాలు చట్టసభల్లో కూడా చర్చకు వచ్చాయని, చాలా వాటికి పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతామని సుభద్ర అన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన జడ్పీటీసీ సభ్యులు, వైస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులందరికీ ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**జడ్పీ ఆస్తుల్లో మూడు జిల్లాలకు సమన్యాయం**

జిల్లా పరిషత్ విభజన అనంతరం విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సమన్యాయం జరిగేలా కార్యక్రమాలు రూపొందించాలని చైర్‌పర్సన్, సీఈవోలను ఎమ్మెల్యే కోరారు. ఏజెన్సీ ప్రాంతాలు, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ గెస్ట్‌హౌస్‌లను వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా ఆస్తులైన భవనాలు, గెస్ట్‌హౌస్‌లు మూడు జిల్లాలకు చెందినవేనని పేర్కొన్నారు. ఆస్తులను భవిష్యత్తులో పంపిణీ చేసే సమయంలో జనాభా ప్రాతిపదికన, ఉద్యోగుల కేటాయింపు తరహాలో మూడు జిల్లాలకు న్యాయమైన వాటా కల్పించాలని కోరారు.

**భావోద్వేగాల నడుమ సత్కార సేవలు**

అనంతరం జెడ్పీ ఛైర్పర్సన్ ను ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే బండారు సత్యానారయణ, ఇతర సభ్యులు దుశ్సాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. ఉమ్మడి విశాఖపట్టణం జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులకు, పలువురు ఎంపీపీలకు అతిథుల చేతుల మీదుగా ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ క్రమంలో సభ్యులు భావోద్వేగంతో కూడిన ప్రసంగాలు చేశారు. అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకున్నారు. కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్, ఉమ్మడి జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



### భాస్కరరావు తల్లికి నివాళులర్పించిన

## శ్రావణ్ కుమార్

**ముంచంగిపుట్టు, (జయ జయహే ):**

మండలంలో గల పెదగూడ పంచాయతీ పనస గ్రామానికి చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మంగళవారం పనస గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లారు. కిడారి శ్రావణ్ కుమార్ మృతురాలి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాండురంగస్వామి, లక్ష్మణ్, టీడీపీ నాయకులు జగత్, మల్లేష్, అచ్చిబాబు, చంటి, రామారావు, చిన్నికిషోర్, బాలరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కళాభారతిలో ఈనెల 26 27తేదీలో 18వ 'వైశాఖి నృత్యోత్సవ్ '

**విశాఖపట్నం (జయ జయహే)**

నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 18వ ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్ -- 'వైశాఖి నత్యోత్సవ్' 2026 ఈనెల 26, 27 తేదీలలో పిఠాపురం కాలనీలోని కళాభారతి ఏసీ ఆడిటోరియంలో వైభవంగా జరగనుంది. రెండు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 5:00 గంటల నుంచి ఈ ప్రదర్శనలు ప్రారంభమవుతాయి.కళాకారులను, నాట్యాభిమానులను ప్రోత్సహించే లక్ష్యంతో ఉ చిత ప్రవేశంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నట్రాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ గౌరవ అధ్యక్షులు సూదగాని రవిశంకర్ నారాయణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ నాట్య నిపుణులకు 'వైశాఖి నాట్యశ్రీ', 'వైశాఖి ఎక్సెలెన్స్ అవార్డు', 'జీవన సాఫల్య పురస్కారాలతో' పాటు పద్మభూషణ్ డాక్టర్ సరోజ వైద్యనాథన్ పేరిట ప్రత్యేక అవార్డు ప్రదానం చేయనున్నారు. నగరంలోని కళాభిమానులందరూ విచ్చేసి ఈ సాంస్కృతిక వేడుకను జయప్రదం చేయాల్సిందిగా ఫెస్టివల్ డైరెక్టర్ బత్తిన విక్రమ్ కుమార్ (విక్రమ్ గౌడ్) విజ్ఞప్తి చేశారు.

## ద్విచక్రం వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

### కించాయిపుట్టు లో విషాదఛాయలు

**ముంచంగిపుట్టు, జయ జయహే:**



మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి మార్గంలో ఇందిరా కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి గిరిజన యువకుడు మృతి చెందాడు ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది అందుకు సంబంధించి వివరాలు మండలంలో గల కిలగాడ కించాయిపుట్టు పంచాయితీ కేంద్రానికి చెందిన రొబ్బా అనంత పద్మనాభం (30) ముంచంగిపుట్టులో జరుగుతున్న వినాయక ఉత్సవాలలో పాల్గొని రాత్రి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మండల కేంద్రం పొలిమేర ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి పల్టీలు కొట్టింది. దీంతో అనంత పద్మనాభం తలకు తీవ్రమైన గాయం తగిలింది చెవి, ముక్కుల నుంచి తీవ్రమైన రక్త స్రావం అయింది ఆ సమయంలో అటుగా వెళుతున్న వ్యక్తులు స్థానికులు సహాయంతో హుటా హుటిన క్షతగాత్రున్ని స్థానిక సిహెచ్ సీ కి తీసుకువచ్చారు. వైద్యులు వైద్య సేవలు అందించే లోపే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్తులు సి.హెచ్.సి కి పెద్ద ఎత్తున చేరుకుని అనంత పద్మనాభం మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యం అయ్యారు. మృతిని పెదనాన్న గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి. నాని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు మృతుడు కించాయిపుట్టు పీసా కమిటీ ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. అందరితో మంచిగా ఉండే వ్యక్తి అకాల మరణంతో కించాయి పుట్టు లో విషాదఛాయలు అలుముకున్నాయి. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

మండలంలో గల కించాయిపుట్టు గ్రామానికి చెందిన రొబ్బాఅనంత పద్మనాభం ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందాడు అన్న విషయం తెలుసుకున్న వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు (రెడ్డి ) బాధిత గ్రామానికి చేరుకున్నారు. మంగళవారం జరిగిన మృతిని అంత్యక్రియలకు ఆయన హాజరయ్యారు. మృతుడికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.





## బిజెపిలో చేరిన వైఎస్ఆర్సిపి నేతలు

### కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు

**పాడేరు (జయ జయహే)**

పాడేరుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు 22 మంది మంగళవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. వారందరికీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. భారతీయ జనతా పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు మఠం శాంత కుమారి , జిల్లా ఇంచార్జ్ పుట్ట గంగయ్య ఆధ్వర్యంలో చేరడం జరిగింది. విశాఖపట్నంలోని పివిఎన్ మాధవ్ స్వగృహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. తమర్బ ప్రసాద్ నాయుడు సమక్షంలో ఆయనతో సహా 22 మంది భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పివిఎన్ మాధవ్ శు భాకాంక్షలు తెలిపారు. గిరిజన ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. భారతీయ జనతా పార్టీని అల్లూరి సీతారామరాజు జిల్లాలో బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసే ప్రతి ఒక్కరికి తగిన సమయంలో తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సల్ల రామక్రిష్ణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎం గోపాల్ పాత్రుడు, లకే భాస్కర్ ట్రెజర్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షులు కేజియా రాణి పాల్గొన్నారు.




## పోగొట్టుకున్న నగదును తిరిగి ప్రయాణికురాలకు అందజేసిన ఆర్టీసీ అధికారులు

**విజయనగరం (జయ జయహే)**

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దేవి అనే పాసింజర్ విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు బస్సు ఎక్కే సమయంలో ఆమె వద్ద ఉన్న 23000 రూపాయలు మనీ పర్స్ అనేది పోగొట్టుకున్నా. ఆ మనీ పర్సన్ కాంప్లెక్స్ లో ఉన్న ప్రయాణికులు గుర్తించి స్టేషన్ మేనేజర్స్ అందజేశారు.పోగొట్టుకున్న పాసింజర్ డిపోకు వచ్చి అడగ్గా ఆమె యొక్క వివరాలు తెలుసుకొని స్టేషన్ మేనేజర్ దుర్గరాజు , ఆర్టీసీ పోలీసులు సమక్షంలో బాధితురాలకు అందజేయడం జరిగింది.



## తుఫాను ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

### పోలీస్ అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం

**పార్వతీపురం మన్యం:(జయ జయహే)**

తుఫాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో తుఫాను పరిస్థితులపై సమీక్షించి పలు సూచనలు చేశారు.నదులు, వాగులు, కాలువలు, చెరువులు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు గ్రామాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి, అత్యవసర సేవలైన అంబులెన్సులు, క్రేన్లు తదితరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, వైద్య శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదాలు, విద్యుత్ వైర్లు తెగిపడటం, చెట్లు కూలడం లేదా ఇళ్లలోకి నీరు చేరడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.వదంతులు, సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలను నమ్మకుండా అధికారిక ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గురువారం ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

### ముఖ్య అతిదిగా హాజరు కానున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

**విజయనగరం జయజయహే**

విజయనగరం పోలీస్ శిక్షణ కళాశాలలో 473 మంది కానిస్టేబుళ్లు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 24న పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై పరేడ్‌ను సమీక్షించనున్నారు.పోలీస్ ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా చట్ట పరిజ్ఞానం, డ్రిల్, ఆయుధ శిక్షణ, శారీరక దారుఢ్యం, నేర పరిశోధన, సైబర్ నేరాలు, జజుబీూ, మహిళలు--బాలల రక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల నిర్వహణ తదితర అంశాల్లో శిక్షణ అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

For a pure tomorrow.. జయహో

# భారీ వర్షాల నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తం

## టెలికాన్ఫరెన్స్ లో ఆదేశాలు జారీ చేసిన సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్

## 12 జిల్లాల్లో డివిజన్ల వారీగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

## విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే తక్షణమే పునరుద్ధరణ చర్యలు

## అత్యవసర సేవలకు నిరంతరం విద్యుత్ సరఫరా

**విశాఖపట్నం, సెప్టెంబర్ 22, జయ జయహే**



రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల పరిస్థితులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా 12 జిల్లాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించిన సీఎండీ, విద్యుత్ వ్యవస్థ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, పోలవరం జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఎక్కడైనా విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది, వాహనాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎండీ తెలిపారు. హాస్పిటళ్లు, తాగునీటి పథకాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మల సమీపానికి వెళ్లరాదని వినియోగదారులకు సూచించారు. విద్యుత్ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా సంబంధిత కంట్రోల్ రూమ్ నంబర్లకు తెలియజేసి సహకరించాలని కోరారు.

జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు

శ్రీకాకుళం
శ్రీకాకుళం - 9701400865 టెక్కలి - 9490610050
పలాస - 08945241084

పార్వతీపురం మన్యం
పాలకొండ -- 8332843546
పార్వతీపురం -- 9398594750

విజయనగరం
విజయనగరం టౌన్ -- 9490610102
విజయనగరం రూరల్ -- 9490610102
బొబ్బిలి -- 9490610121

విశాఖపట్నం
జోన్--× -- 9490610019
జోన్--×× -- 9849628880
జోన్--××× -- 9491030722

అనకాపల్లి
అనకాపల్లి -- 9490610023
కశింకోట -- 8333810597
నర్సీపట్నం -- 9491030723

అల్లూరి సీతారామరాజు
పాడేరు -- 9490610027

కాకినాడ
జగ్గంపేట -- 9490610097
కాకినాడ -- 9490610856
పెద్దాపురం -- 9493178728

తూర్పు గోదావరి
రాజమహేంద్రవరం టౌన్ -- 9490610855
రాజమహేంద్రవరం రూరల్ -- 9490610859
నిడదవోలు -- 9493177540

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
అమలాపురం -- 9490610101
కొత్తపేట -- 9493178821

పశ్చిమ గోదావరి
నరసాపురం -- 7382050943
భీమవరం -- 9490610143
తాడేపల్లిగూడెం -- 9493177806

ఏలూరు
ఏలూరు -- 9440904037
జంగారెడ్డిగూడెం -- 9491030712

పోలవరం
రంపచోడవరం -- 8309771508

ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం
8331018762



## గ్లోబలవుతున్న గజల్ శ్రీనివాస్

# గీతా గానం

### ఆంగ్ల ఆడియో ఆల్బమ్ ఆవిష్కరించిన మారిషస్ రాష్ట్రపతి ధరమ్ బీర్

### ప్రపంచ వ్యాప్తంగా భారతీయ ఆధ్యాత్మిక సందేశాన్ని విస్తరించడమే లక్ష్యం

**మారిషస్, సెప్టెంబర్ 22, జయ జయహే :**

ప్రపంచ ప్రఖ్యాత గజల్ గాయకుడు డా. గజల్ శ్రీనివాస్ రూపొందించిన "శ్రీమద్భగవద్గీత -- ఆంగ్ల ఆడియో ఆల్బమ్" మారిషస్‌లో ఘనంగా లోకార్పణం జరిగింది. మారిషస్ రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ దంపతులు శ్రీ హరిహర దేవస్థానం--కళాజ్యోతి ప్రాంగణంలో ఈ ఆడియో ఆల్బమ్‌ను తాజాగా ఆవిష్కరించారు. శ్రీమద్భగవద్గీతలోని 700 శ్లోకాలను డా. గజల్ శ్రీనివాస్ స్వరపరచి, స్వయంగా గానం చేసిన ఈ ఆడియో ఆల్బమ్ ప్రత్యేకతను సంతరించుకుంది. కోల్‌కతాలోని అద్వైత ఆశ్రమానికి చెందిన స్వామి స్వరూపానంద అందించిన ఆంగ్ల అనువాదాన్ని ఆధారంగా చేసుకుని ఆల్బమ్‌ను రూపొందించారు. గీతా తాత్పర్యాలకు ఎన్. పార్థసారథి ఆంగ్లంలో స్వరాన్ని అందించారు. ఆల్బమ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మారిషస్ రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ మాట్లాడుతూ, డాక్టర్ గజల్ శ్రీనివాస్ రూపొందించిన శ్రీమద్భగవద్గీత ఆంగ్ల ఆడియో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. శ్రీమద్భగవద్గీత విశ్వమానవాళికి శాశ్వత జీవన గ్రంథమని పేర్కొన్నారు. శ్రీమద్భగవద్గీతను ప్రపంచంలోని 100 భాషల్లో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో డా. గజల్ శ్రీనివాస్ చేపట్టిన గ్లోబల్ గీతా ఉద్యమాన్ని రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదను ప్రపంచ ప్రజలకు చేరువ చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని బృందావన పార్థసారథి సమన్వయం చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా మారిషస్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి అజయ్ గున్నెస్, ఆర్థిక శాఖ మంత్రి జ్యోతి జీతన్, దేశ ప్రధాన కార్యదర్శి సురేష్ సీబాలక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారికి రాష్ట్రపతి ధరమ్‌బీర్ గోకుల్ శ్రీమద్భగవద్గీత ఆడియో పెన్‌డ్రైవ్‌లను అందజేశారు. భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని తన గానం ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో డా. గజల్ శ్రీనివాస్ చేపట్టిన గ్లోబల్ గీతా మిషన్‌లో ఆంగ్ల శ్రీమద్భగవద్గీత ఆడియో ఆల్బమ్ ఆవిష్కరణ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.



## ఇందిరానగర్ మాలకొడు వద్ద ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణంలోని ఇందిరానగర్ మాలకొడు వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలను గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులను ఆకట్టుకునేలా వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అట్లపాడు గ్రామానికి చెందిన కాశీ విశ్వేశ్వర స్వామి కోలాట భజనా మండలి సభ్యుల ఆధ్వర్యంలో కోలాటం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో కళాకారులు కోలాటం ప్రదర్శిస్తూ భక్తులను అలరించారు. కోలాట భజనా మండలి సభ్యుల ప్రదర్శనకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఎన్టీఆర్ నగర్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

### 30 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22, జయ జయహే**



శ్రీకాళహస్తి పట్టణంలోని 22వ వార్డు ఎన్టీఆర్ నగర్ కొండ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు లేక స్థానికులు కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించింది. విద్యుత్ సర్వీస్ లైన్లను ఇళ్లకు తీసుకెళ్లేందుకు కర్రల సహాయంతో వైర్లు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ఆందోళన చెందేవారమని పేర్కొన్నారు. ఈ సమస్యను వార్డు ఇంచార్జి నెమళ్లూరు బుజ్జి శ్రీకాళహస్తి శాసనసభలు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి శాసనసభలు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు అవసరమైన ప్రాంతాల్లో స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ ఏఈ చెంచు కృష్ణ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి నెమళ్లూరు బుజ్జితో పాటు టీడీపీ నాయకులు చెంబెటి బాలయ్య, శంకరయ్య, శేఖర్, లోకేష్, పవన్, తేజ, లైన్ ఇన్‌స్పెక్టర్లు మునిరాజా, వాజిద్, జానకిరామ్, కాంట్రాక్టర్ మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.



## జంగారెడ్డిగూడెం అభివృద్ధికి రూ.169.06 కోట్లు

### రూ.19 కోట్ల హెచ్‌ఏఎం పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్

**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 22, జయ జయహే:**

జంగారెడ్డిగూడెం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.169.06 కోట్ల నిధులు మంజూరు చేసిందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా హెచ్‌ఏఎం పథకం కింద మంజూరైన రూ.19 కోట్ల విలువైన పనులకు బుధవారం ఆలపాటి గంగాభవాని ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల సుందరీకరణ, ఆధునిక వీధి దీపాలు, రోడ్డు డివైడర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఏఐఐబీ, అమృత్ 2.0, ఎస్‌బీఎం 2.0, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రూ.110.06 కోట్ల విలువైన తాగునీరు, డ్రైనేజీ తదితర పనులు కొనసాగుతున్నాయన్నారు. అదనంగా యూసీఎఫ్ ఫేజ్-3 కింద మరో రూ.40 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధికి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నిధులు తీసుకువచ్చి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి జంగారెడ్డిగూడెంను ఏలూరు జిల్లాలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా యువశ్రీ మురళి

### ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే ఆదిమూలం

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 22, జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ మారుమూల గ్రామం నుంచి ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన యువశ్రీ మురళిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘనంగా సన్మానించారు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కళ్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న యువశ్రీ మురళిని ఎమ్మెల్యే అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువశ్రీ మురళికి లభించిన పురస్కారం ఆయనకు మాత్రమే కాకుండా సత్యవేడు నియోజకవర్గానికి, ప్రభుత్వ పాఠశాలలకు, తెలుగు భాషకు దక్కిన గౌరవమన్నారు. తెలుగు భాషపై అభిమానం, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తూ బాలల సృజనాత్మకతను వెలికితీస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల కోసం కథలు, పుస్తకాలు రూపొందించడం, పాఠ్యపుస్తక రచన, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాల ద్వారా భాషా సేవ చేస్తున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం స్ఫూర్తిదాయకమని, యువశ్రీ మురళి మరింతగా విద్యా, సాహిత్య, భాషా రంగాల్లో సేవలు కొనసాగించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం యువశ్రీ మురళిని మరోసారి సన్మానించి ఆయన సేవలను అభినందించారు.



## పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం

### ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22, జయ జయహే**

శ్రీకాళహస్తి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జైహింద్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'పోషణ మాస ఉత్సవాలు' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషణ కిట్లు, పాలు, గుడ్లు, ఖర్జూరం, అటుకులను క్రమం తప్పకుండా తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లలో లభించే పోషకాలు, విటమిన్లపై భోజన ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహార పదార్థాలను పంపిణీ చేశారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు మూడేళ్లు వచ్చే వరకు తల్లులు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణ, ప్రమీల, రోజా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఘన స్వాగతం

**శ్రీకాళహస్తి , సెప్టెంబర్ 22, జయ జయహే**



శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు మంగళవారం తిరుపతి విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ ఘన స్వాగతం పలికారు. పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోకరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత విశ్వగురు సంకల్ప సిద్ధి మహాయాగం కార్యక్రమంలో పాల్గొనేందుకు పీవీఎన్ మాధవ్ తిరుపతికి చేరుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జల్లి మధుసూదన్ పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో పీవీఎన్ మాధవ్‌ను సత్కరించారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అన్నమయ్య జిల్లా బీజేపీ ఇన్‌చార్జి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జోరు వానలోను ఆగని అన్న సమారాధనలు

## ఉత్సాహభరితంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు





**దేవరాపల్లి, సెప్టెంబర్ 22 జయ జయహే :**

మండల కేంద్రంలోని యాతపేటలో ఘడా బాయ్స్, షేక్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తొమ్మిదో రోజు సందర్భంగా మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రాజేశ్వరి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు భాస్కరరావు దంపతులను శాలువాతో సత్కరించారు.

**రైవాడలో...**

రైవాడ కాలనీలో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తొమ్మిదో రోజు స్వామివారిని అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ మాజీ టీడీపీ ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, లెక్చరర్ శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చల్లా నానాజీ, కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయ ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ చల్లా కృష్ణవేణి ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. తుఫాను ప్రభావంతో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైవాడతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



# పట్టణాభివృద్ధి పనులకు శ్రీకారం

## తిరుపతి జిల్లాలో రూ.206 కోట్ల పనులు

**తిరుపతి, సెప్టెంబర్ 22, జయ జయహే**

తిరుపతి రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసే లక్ష్యంతో పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో రూ.11,359 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టగా, 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో వివిధ పనులు చేపట్టనున్నారు.తిరుపతి జిల్లాలో సుమారు రూ.206 కోట్ల విలువైన పనులు ప్రారంభమవుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఇందులో తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో రూ.106 కోట్లతో రహదారులు, సెంట్రల్ మీడియన్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్ తదితర మౌలిక వసతుల పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా పట్టణ మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ, తుడా చైర్మన్ డాలర్ దివాకర్, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించిన జిల్లా ఎస్పీ

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధ్యక్షతన జిల్లాస్థాయి నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశానికి జిల్లాలోని అందరూ డిఎస్పీలు సిఐలు ఎస్సైలు హాజరు కావడం జరిగింది . ఈ సందర్భంగా జిల్లాలో పోలీసులు విధులలో విశేష ప్రతిభ కనబరిచిన 57 మంది పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించడం జరిగింది అచ్యుతాపురం సిఐ చంద్రశేఖర్ కసింకోట సీఐ స్వామినాయుడుకు వీరిని ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ ప్రజల భద్రత విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు భద్రత డ్రంక్ అండ్ డ్రైవ్ జాతీయ రహదారుల ప్రధాన కోడలు వద్ద రోడ్డు ప్రమాదాలు నివారణ ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని ఆయన సూచించారు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు శాతం పెంచాలని హెల్మెట్ నిబంధన కఠినంగా అమలు చేయాలని అలాగే గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ప్రమాద ప్రదేశాల ప్రత్యేక నిఘా ఉంచాలని బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ హౌసింగ్ దొంగతనాలు రాత్రిపూట గస్తీ బీట్ పెట్రోలు పటిష్టం చేయాలని అలాగే న్యాయం జరిగిన వెంటనే త్వరితగతిన కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రికవరీ సాధించేలా చూడాలని పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని మహిళలు చిన్నారుల రక్షణ అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పాఠశాలలో కళాశాలలో అవగాహన సదస్సులు వీటిపై నిర్వహించడంతో పాటు శక్తి టీమ్స్ తో ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సామశాత్మక గ్రామాలను ముందస్తుగా గుర్తించి ఆ ప్రాంతాలు సందర్శించి శాంతి భద్రతలను పర్యవేక్షించాలని ఆయన సూచించారు రౌడీ షీటర్లు సంఘ విద్రోహసతులపై బైండెవరు చర్యలు తీసుకోవాలని పెండింగ్లో ఉన్న నాన్బెయిల్ వారంట్లను శీఘ్రగతిన అమలు చేయాలని ముఖ్యంగా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు వద్ద ప్రత్యేకంగా నిఘా ఉంచాలని విపత్తు నిర్వహణ విభాగం మరియు రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి కష్టాలు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు



# ఆర్థిక వికాసమే లక్ష్యంగా గ్రామీణ బ్యాంక్ రుణాలు

## ఏపీ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె. ప్రమోద్ కుమార్ రెడ్డి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 22, జయ జయహే**

శ్రీకాళహస్తి గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ వర్గాల ప్రజలకు సకాలంలో రుణ సదుపాయాలు అందించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రధాన లక్ష్యమని బ్యాంక్ చైర్మన్ కె. ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు.శ్రీకాళహస్తిలో నిర్వహించిన బ్యాంక్ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ), రిటైల్ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) జె. రవికుమార్, రీజినల్ మేనేజర్ ఎన్. కామేశ్వరరావులతో కలిసి చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి లబ్ధిదారులకు రూ.70 కోట్ల ఎస్‌హెచ్‌జీ రుణాలు, రూ.6 కోట్ల ఎంఎస్‌ఎంఈ రుణాలు, రూ.4.50 కోట్ల రిటైల్ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించే క్రమంలో రూ.87 లక్షల హార్వెస్టర్ రుణాన్ని కూడా అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు బ్యాంకు ద్వారా పొందిన రుణాలను ఉత్పాదక కార్యకలాపాలకు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు దోహదపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, వివిధ రుణ పథకాల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విజనరీ వెంటే విశాఖ: గంటా

**విశాఖపట్నం, సెప్టెంబర్ 22: (జయ జయహే)**

విజనరీ లీడర్, సీఎం చంద్రబాబు వెంటే విశాఖ ప్రజలు ఉంటారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ వి కన్వెన్షన్ లో రూ. 3,892 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్ గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖను చంద్రబాబు మానస పుత్రికగా అభివర్ణించారు. ఇక్కడి ప్రజలు ఎప్పుడూ చంద్రబాబుకు అండగా ఉంటారని పేర్కొంటూ.. 2019 వైసీపీ గాలిలో సైతం విశాఖలో నాలుగు దిక్కులు ( ఈస్ట్.. వెస్ట్.. నార్త్.. సౌత్) చంద్రబాబుకే జై కొట్టాయని తెలిపారు. హుద్ హుద్ సమయంలో 10 రోజుల పాటు బస్సులో బస చేసి పరిస్థితిని చక్కదిద్దిన సీఎం పట్ల విశాఖ ప్రజలందరూ అభిమానంతో ఉంటారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు సాధించి రాజకీయంగా జగన్మోహన్ రెడ్డి విశాఖ మర్చిపోయేలా చేయాలన్నారు. దేశంలో మూడొంతుల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ కు.. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్లో మూడో వంతు విశాఖకు వస్తున్నాయని పేర్కొన్నారు. భీమిలి, పెందుర్తిలలోనే అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. ఒకే రోజు విశాఖలో 25 ఐటీ కంపెనీలకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారని, 16 ఫైవ్ స్టార్ హోటల్స్ వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్టు - విశాఖ మధ్య ఉన్న భీమిలి, మధురవాడ ప్రాంతం హైదరాబాద్ గచ్చిబౌలి, మాదాపూర్ స్థాయిలో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మధురవాడలో రూ. 725 కోట్ల నిరంతర తాగు నీరు.. రూ. 658 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టులు రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.



# పి.హెచ్.సి ఆవరణం అంతా బురదమయం

## పలు అవస్థలు పడుతున్న రోగులు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 22, జయ జయహే**

మండల కేంద్రం దేవరాపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి ఆవరణ ప్రాంతం అధ్వానంగా మారింది. పి హెచ్ సికి వచ్చి పోయే రోగులు, స్థానికులు, వైద్య సిబ్బంది అనేక అవస్థలు పడుతున్నారు. పలు రోగాలతో వచ్చిన తాము బురదలో జారి పడితే పరిస్థితి ఏంటి అని రోగులు వాపోతున్నారు. పి హెచ్ సి ఆవరణలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పి హెచ్ సి ఆవరణం అంతా బురదమయం అయ్యింది. ఆసుపత్రి ముందు వర్షం నీరు నిల్వ ఉండడంతో మినీ చెరువులా దర్శనమిస్తుంది. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి ఆస్పత్రికి వెళ్లే దారిని మెరుగుపరచాలని స్థానికులు, రోగులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.




# దేవరాపల్లిలో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

## అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి. లక్ష్మీదేవి విజ్ఞప్తి

**దేవరాపల్లి, సెప్టెంబర్ 22, జయ జయహే**

వాయుగుండం ప్రభావంతో మండలంలో జోరు వాన కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా వానలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవరాపల్లి మండలంలో మోస్తారు వర్షాలు కొరవడంతో మంగళవారం సాయంత్రానికి 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తహసిల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. మండల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని ఆమె హెచ్చరించారు. చెట్లు, శిథిలావస్థలో ఉన్న పాత భవనాల వద్ద ఎవరు ఉండవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో సహస్ర దీపార్చన సందడి

**దేవరాపల్లి, సెప్టెంబర్ 22, జయ జయహే**

మండల కేంద్రంలోని కుమ్మరివీధిలో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతుల్లో అందమైన ముగ్గులు వేసి, వాటి చుట్టూ దీపాలను వెలిగించారు. దీంతో ఆలయ పరిసరాలు దీపకాంతులతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ వి. సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు హాజరై సహస్ర దీపార్చనను తిలకించారు. మహిళా భక్తుల భక్తిశ్రద్ధలను అభినందించారు. అనంతరం శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

**తిరుపతి, సెప్టెంబర్ 22, జయ జయహే**

తిరుపతి రానున్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆర్యవైశ్య సమాజానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని తిరుపతి మహానగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కొండూరి చంద్రశేఖర్, తేజ్ యశస్వి కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నగర అభివృద్ధి, సామాజిక సేవ, విద్య, ధార్మిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సమాజం భాగస్వామ్యం కలిగి ఉందన్నారు. అర్హత, ప్రజాసేవా అనుభవం, ప్రజల విశ్వాసం ఉన్న వారికి అవకాశాలు కల్పించాలని రాజకీయ పార్టీలను కోరారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నామా రాజేష్, సత్యనారాయణ, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# అమానుషం

ప్రతాప్

**న్యూఢిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురిని పోలీసులు సెప్టెంబర్ 16న అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకరు 19 ఏళ్ల యువకుడు కాగా, మిగిలిన ముగ్గురు బాలురు. వారిలో ఇద్దరు 17 ఏళ్లవారు కాగా, మరొకరు 16 ఏళ్లవాడని పోలీసులు తెలిపారు.**

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, సెప్టెంబర్ 10న బాలిక తనకు పరిచయమున్న ఒక యువకుడిని కలవడానికి వెళ్లింది. అనంతరం అతడు తన ముగ్గురు స్నేహితులను అక్కడికి పిలిచినట్లు పోలీసులు తెలిపారు. టెంపోలో ఉన్న సమయంలో బాలికపై లైంగిక దాడి జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ విషయాన్ని పోలీసులకు చెబుతానని బాలిక హెచ్చరించిన అనంతరం ఆమెను హత్య చేసినట్లు పోలీసులు ఆరోపించారు.

అనంతరం మృతదేహాన్ని స్వరూప్ నగర్‌లోని కుషక్ రోడ్ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో వదిలివేసినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 12--13 మధ్య రాత్రి ఆ ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సెప్టెంబర్ 13న పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం పరిస్థితి కారణంగా బాధితురాలి గుర్తింపును నిర్ధారించడం కొంత కష్టమైందని అధికారులు తెలిపారు.

ప్రత్యక్ష సాక్షులు లేకపోవడంతో పోలీసులు సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. పరిసర ప్రాంతాల్లోని 50కి పైగా జజుు కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. సంఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో సంచరించిన ఒక టెంపో పోలీసులకు కీలక ఆధారంగా మారింది. వివిధ ప్రాంతాల్లోని జజుు దృశ్యాలను అనుసంధానించి ఆ వాహనాన్ని గుర్తించిన పోలీసులు, టెంపో డ్రైవర్‌ను విచారించడం ద్వారా నిందితుల వరకు చేరుకున్నట్లు తెలిపారు.

దర్యాప్తులో భాగంగా పోలీసులు ఒక టెంపో, రెండు కత్తులు, కొన్ని దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటిపై ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిందితుల్లో ఒకరు తనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరించినట్లు పోలీసులు తెలిపారు. అందుబాటులో ఉన్న వైద్య, ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తూ ప్రతి నిందితుడి పాత్రను పోలీసులు నిర్ధారిస్తున్నారు.

ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (దీచీ) మరియుూజాూ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఖీ×=లో దీచీలోని 103(1), 238(ూ), 65(1), 3(5) సెక్షన్లతో పాటుూజాూ చట్టంలోని సెక్షన్ 6 కింద కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

**(మీడియా రిపోర్టుల ఆధారంగా)**

# ఆన్‌లైన్ ఆఫర్ల జాతర

## అధికంగా ఆదా చేసుకోవాలంటే ఈ టిప్స్ పాటించండి

ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్ ఫాంలు మళ్లీ కళకళలాడుతున్నాయి. పంద్రాగస్టు వేడుకలు సమీపించడంతో అన్ని ప్రముఖ ఈ-కామర్స్ సైట్లు ఫెస్టివల్ సేల్స్ ను ప్రారంభించాయి. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మింత్రా, అజియో వంటి ప్లాట్ ఫారం సేల్స్ ప్రారంభించాయి. రానున్నది కూడా పండుగల సీజన్ కావడంతో ఇంకా సేల్స్ కొనసాగే అవకాశం ఉంది. వినాయక చవితి, దసరా, దీపావళి వరకూ సేల్స్ కొనసాగుతూనే ఉంటాయి. ఇక్కడ పెద్ద సంఖ్యలో ఆఫర్లు ఉంటాయి కాబట్టి కొనుగోలుదారులు కూడా వీటిపై ఆసక్తి చూపుతారు. అయితే ఇటువంటి సేల్స్ లో మీరు మరింత ఎక్కువగా ఆదా చేసుకునే అవకాశాలుంటాయి. అవగాహన లేకపోతే నష్టపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే ఆన్ లైన్ ప్లాట్ ఫారంలలో షాపింగ్ చేసే వారికి ఇటువంటి బిగ్ సేల్స్ సమయంలో మోస పోకుండా.. ఎక్కువగా ఆదా చేసుకోవడానికి అవసరమయ్యే టిప్స్ మీకు అందిస్తున్నాం. ఇంకెందుకు ఆలస్యం చదివేయండి..




**అధికారిక వెబ్ సైట్లు..**
ప్లాట్ ఫాం ఏదైనా గానీ అది అసలుదా.. నకిలీదా అనేది తనిఖీ చేసుకోవాలి. డిజిటల్ మార్కెటింగ్ బాగా పెరిగాక.. ఆఫర్లు, డీల్స్ పేరిట సోషల్ మీడియా పోస్టులు పెరిగిపోతున్నాయి. వాటిపై క్లిక్ చేస్తే నకిలీ వెబ్ సైట్లలోకి మిమ్మల్ని తీసుకెళ్లి మోసం చేస్తాయి. అందుకే అధికారిక విక్రయ పేజీల్లో మాత్రమే షాపింగ్ చేయండి. అందులోనే ఆఫర్లు, తగ్గింపులు, క్యాష్ బ్యాక్ లను తనిఖీ చేసి, సద్వినియోగం చేసుకోండి.

**ప్లే గేమ్స్.. ఎర్న్ రివార్డ్స్..**
చాలా ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు పండుగ విక్రయాల సమయంలో ఉత్సాహభరితమైన గేమ్‌లు, పోటీలను కలిగి ఉంటాయి. వీటిలో ఉచితంగా పాల్గొనొచ్చు. మీరు గెలిచినప్పుడు కాయిన్స్, వాలెట్ బ్యాలెన్స్, రివార్డు పాయింట్‌లు వస్తాయి. వాటిని రీడీమ్ చేసుకోవడం ద్వారా మీ బిల్లు తగ్గుతుంది. కొన్ని సందర్భాల్లో నగదు బహుమతులు కూడా వస్తాయి.



**సబ్ స్క్రిప్షన్..**
మెంబర్‌షిప్ లేదా సబ్‌స్క్రిప్షన్ (అమెజాన్ ప్రైమ్, ఫ్లిప్‌కార్ట్ ప్లస్/ప్రీమియం, మింత్రా ఇన్‌సైడర్ మొదలైనవి) కలిగి ఉండటం వలన ప్రత్యేకమైన ఆఫర్‌లు, మెరుగైన తగ్గింపులు, విక్రయానికి ముందస్తు యాక్సెస్ వంటి అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. కంపెనీలు తరచుగా నిర్దిష్ట వినియోగదారులకు విక్రయానికి ముందు ఉచిత ట్రయల్ సభ్యత్వాన్ని అందిస్తాయి. ఈ సమయంలో వివిధ సబ్‌స్క్రిప్షన్ కూపన్‌లు, ఆఫర్‌లను కూడా కనుగొనవచ్చు. ఇది కూడా మీ బిల్లును తగ్గించేందుకు ఉపకరిస్తుంది.

**కూపన్ కోడ్‌లు**
ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు వారి మార్కెటింగ్ అండ్ ప్రమోషనల్ స్ట్రాటజీల ప్రకారం పెద్ద పండుగ విక్రయాల సమయంలో చాలా కూపన్ కోడ్‌లతో వస్తాయి. ఈ కూపన్ కోడ్‌లు మీకు అదనపు డిస్కౌంట్‌లు లేదా క్యాష్‌బ్యాక్ లేదా ఇతర రివార్డ్‌లను అందిస్తాయి. వీటితో సేల్ డిస్కౌంట్‌ల కంటే ఎక్కువ లాభం పొందవచ్చు. మీరు ఉత్పత్తి పేజీలు, అధికారిక విక్రయ వెబ్‌పేజీలు, డీల్ సైట్‌లలో కూపన్ కోడ్‌లను చూడొచ్చు.

**యాప్ ప్రత్యేక ఆఫర్‌లు..**
ప్రయోజనాలను పొందడానికి యాప్‌లో మాత్రమే వర్తించే ఆఫర్‌లు ఉంటాయి. ఎందుకంటే ఎక్కువ మంది కొనుగోలుదారులను షాపింగ్ చేసేది మొబైల్లోనే. అందువల్ల, పండుగ సేల్ వ్యవధిలో ఎల్లప్పుడూ అధికారిక యాప్ లను తనిఖీ చేయండి. అక్కడ ఏమైనా ప్రత్యేకమైన ఆఫర్లు ఉండే అవకాశం ఉంది.

**క్యాష్‌బ్యాక్ సైట్‌లు**
మీకు క్యాష్‌బ్యాక్ అందించే వెబ్‌సైట్‌లు చాలా ఉన్నాయి. పండుగ విక్రయాల సమయంలో అవి అధిక క్యాష్‌బ్యాక్ రేట్లను కలిగి ఉంటాయి. ఇవి ఆన్ లైన్ వ్యాపారుల నుంచి కమీషన్ తీసుకుని మీ వాటాను మీకు క్యాష్ బ్యాక్ చేస్తాయి. అయితే ఇక్కడ నకిలీలకు ఆస్కారం ఉంది. అప్రమత్తంగా ఉండాలి. లావాదేవీని ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేసుకోవాలి.

**బ్యాంక్, వాలెట్ ఆఫర్‌లు..**
ఇవి అదనపు పొదుపును అందిస్తాయి. ముఖ్యంగా పండుగ విక్రయాల సమయంలో వీటికి ఎక్కువ అవకాశం ఉంటుంది. బ్యాంక్ ఆఫర్‌లు మీకు తక్షణ తగ్గింపులను అందిస్తాయి, అయితే వాలెట్ ఆఫర్‌లు మీకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తాయి. బ్యాంక్ ఆఫర్‌లు క్రెడిట్ కార్డ్‌లు (మెరుగైన తగ్గింపులు), డెబిట్ కార్డ్‌లు, ఈఎంఐ, ఈఎంఐ యేతర షాపింగ్‌లపై అందిస్తాయి.

**అధిక విలువైన ఉత్పత్తులను షాపింగ్ చేయండి..**
అధిక విలువైన ఉత్పత్తులకు అధిక తగ్గింపులు లభిస్తాయి. ఎందుకంటే అవి మెరుగైన రాబడికి సహాయపడతాయి. ఇవి మొబైల్‌లు, రిఫ్రిజిరేటర్‌లు, వాషింగ్ మెషీన్‌లు, ఎయిర్ కండిషనర్లు, టెలివిజన్‌లు, ఫర్నీచర్, ల్యాప్‌టాప్‌లు మొదలైనవి కావచ్చు. ఇంతకు ముందు చెప్పినట్లుగా, బ్యాంక్ ఆఫర్‌లు పెద్ద ఆర్డర్‌లపై ఎక్కువ తగ్గింపులను ఇస్తాయి కాబట్టి మీరు ఇక్కడ కూడా ఎక్కువ ఆదా చేస్తారు.

**ముందుగా బుక్ చేయండి ..**
చాలా మంది నామమాత్రపు రేటుతో విక్రయానికి ముందు విక్రయ ధరల వద్ద ఎంపిక చేసిన ఉత్పత్తులను ప్రీ-బుకింగ్ చేయడానికి అనుమతిస్తారు. సేల్ సమయంలో మీరు మిగిలిన మొత్తాన్ని చెల్లించాలి. ఇక్కడ విక్రయ సమయంలో ధరతో సంబంధం లేకుండా మీకు ఆసక్తి ఉన్న ఉత్పత్తిని అదే విక్రయ ధరకు కొనుగోలు చేయవచ్చు. ఆ ఉత్పత్తికి అధిక డిమాండ్ ఉన్నట్లయితే, విక్రయం పెరుగుతున్న కొద్దీ దాని విక్రయ ధర పెరగవచ్చు. ఈ సమయంలో ప్రీ-బుకింగ్ మీకు సహాయపడుతుంది. అలాగే, మీరు 'అవుట్-ఆఫ్-స్టాక్' సమస్యల నుంచి తప్పించుకోవచ్చు.
వీటితో పాటు కొత్త యూజర్ ఆఫర్లు, ఎక్స్ చేంజ్ ఆఫర్లు, ఫస్ట్ డే, లాస్ట్ డే ఆఫర్లు మీకు అదనపు నగదును ఆదా చేయడానికి ఉపకరిస్తాయి.

# దేశంలోనే అత్యంత పొడవైన రైలు మార్గాలు



**ఏమిటో తెలుసా?**

భారతదేశంలో ప్రతిరోజూ చాలా మంది రైలులో ప్రయాణిస్తుంటారు. కొందరు వ్యక్తులు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి 1 గంట పడుతుంది. మరికొందరు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి 2 నుండి 3 రోజులు ప్రయాణం చేస్తారు. అయితే ఆసేతు హిమాచలం అంటే కన్యాకుమారి నుంచి కాశ్మీర్, ఈశాన్య భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకూ ప్రయాణించడానికి రైళ్లకు చాలా సమయం పడుతుంది. వీటిలో 2 నుంచి 3 రోజులు ప్రయాణించే అనేక రైళ్లు ఉన్నాయి. ఇందులో అతి సుదీర్ఘంగా ప్రయాణించే 5 రైళ్లు ఉన్నాయి. ఈ రోజు మనం భారతీయ రైల్వేలలో ఎక్కువ దూరం ప్రయాణించే రైళ్ల గురించి తెలుసుకుందాం..

**వివేక్ ఎక్స్‌ప్రెస్**
భారతదేశంలో ఎక్కువ దూరం ప్రయాణించే రైళ్లలో వివేక్ ఎక్స్‌ప్రెస్ పేరు కూడా ఉంది. ఈ రైలు అస్సాంలోని దిబ్రూఘర్ నుంచి తమిళనాడులోని కన్యాకుమారి వరకూ దాదాపు 4,200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. రైలు వారానికోసారి నడుస్తుంది. ఈ రైలులో ప్రయాణాన్ని పూర్తి చేయడానికి సుమారు 80 గంటలు పడుతుంది. ఈ రైలు మార్గంలో 50 సార్లు కంటే ఎక్కువ ఆగుతుంది. ఈ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు అస్సాంలోని పచ్చని తేయాకు తోటల నుంచి కన్యాకుమారిలోని ఇసుక బీచ్‌ల వరకు ఉండే అందమైన దృశ్యాలను ప్రయాణికులు చూడవచ్చు.

**హిమసాగర్ ఎక్స్‌ప్రెస్**
హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ అనేది తమిళనాడులోని కన్యాకుమారి నుంచి జమ్మూ కశ్మీర్‌లోని కత్రా వరకు నడిచే వారపు రైలు. ఇది దాదాపు 3,800 కి.మీ.ల దూరాన్ని కవర్ చేస్తుంది. ఇది పొడవైన రైల్వే మార్గం. ఈ రైలు తన ప్రయాణాన్ని పూర్తి చేయడానికి సుమారు 73 గంటల 5 నిమిషాలు తీసుకుంటుంది. హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ 12 రాష్ట్రాల గుండా వెళుతుంది. 71 స్టేషన్లలో ఆగుతుంది. కత్రాలోని వైష్ణో దేవి ఆలయాన్ని సందర్శించే ప్రయాణికులకు ఈ రైలు ఉత్తమ ఎంపిక.

**దిబ్రూఘర్ ఎక్స్‌ప్రెస్**
సుదీర్ఘంగా ప్రయాణించే రైళ్లలో దిబ్రూఘర్ ఎక్స్‌ప్రెస్ పేరు కూడా చేర్చబడింది. అస్సాంలోని న్యూ టిన్సుకియా నుంచి బయలుదేరి చివరి గమ్యస్థానానికి చేరుకునే ఈ రైలు 3,547 కి.మీ. ప్రయాణాన్ని పూర్తి చేయడానికి సుమారు 68 గంటలు పడుతుంది. మార్గంలో 35 స్టాప్‌లు ఉన్నాయి. దిబ్రూఘర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ, ప్రయాణికులు గౌహతి, కోల్‌కతా, బెంగళూరు, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల ద్వారా సుందరమైన ప్రయాణాన్ని ఆనందిస్తారు.

**కేరళ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్**
కేరళ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ కేరళలోని తిరువనంతపురంను పంజాబ్‌తో కలుపుతూ 3,398 కి.మీ ప్రయాణిస్తుంది. ఈ ఎక్స్ ప్రెస్ తన గమ్యాన్ని చేరుకోవడానికి దాదాపు 54 గంటల 25 నిమిషాల సమయం పడుతుంది. యాత్రికులు భారతదేశం దక్షిణ, ఉత్తర ప్రాంతాల మధ్య ఉండే అందమైన ప్రదేశాలను చూడవచ్చు.

**సిల్చార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్**
ఈ రైలు ప్రతివారం సిల్చార్, అస్సాం, సికింద్రాబాద్, గౌహతి మీదుగా తెలంగాణలో నడుస్తుంది. ఇది 2,875 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తుంది. అలాగే ఈ ట్రైన్ ప్రయాణాన్ని పూర్తి చేయడానికి 54 గంటల 45 నిమిషాలు పడుతుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com